

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 42.0
కనిష్ఠం : 24.0

ఒకేషనల్ ఫలితాల్లోనూ అదేజోరు
82 శాతం ఉత్తీర్ణతతో బాలికలు టాప్‌స్థానం
సంఖ్యాపరంగా ప్రైవేటు కళాశాలల విద్యార్థులదే హవా
మళ్లీ చతికిలపడిన హైస్కూల్ ప్లస్‌లు
15 నుంచి సప్లిమెంటరీ విద్యార్థులకు రెమిడియల్ క్లాసులు

డిజిటల్ కష్టాలు



- మొరాయించిన బ్యాంకు సర్వర్లు
- స్తంభించిన యూపీఐ లావాదేవీలు
- నగదు బదిలీ కాక జనం పాట్లు

నరసాపురం టౌన్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో శనివారం మధ్యాహ్నం మూడు గంటలపాటు డిజిటల్ బ్యాంకింగ్ సేవలు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బ్యాంకు సర్వర్లు పనిచేయకపోవడంతో ఫోన్ పే, గూగుల్ పే, ఇతర యూపీఐ లావాదేవీలన్నీ స్తంభించాయి. ఈ విషయం తెలియక బయటకు వెళ్లిన వినియోగదారులు నానా కష్టాలు పడ్డారు. ఆటో, కార్లకు కిరాయిలు ఇద్దామంటే పర్సు లేదు. మందులు కొందామంటే డబ్బులు లేవు. హోటల్‌లో తిని బిల్లు ఇద్దామన్న ఇదే పరిస్థితి. దీంతో కొంత మంది తెలిసిన వారి దగ్గర అప్పులు తెచ్చి బిల్లులు కట్టారు. మరికొందరు సాయంత్రం ఇస్తామని చెప్పి బయటపడ్డారు. మరికొందరు కొన్న వస్తువులు అక్కడ వదిలి ఇంటికొచ్చి డబ్బులు తీసుకుని వెళ్లి సరుకులు తెచ్చుకున్నారు. గతంలో ఇలాంటి అనుభవాలను చాలాసార్లు చూశారు. అయితే ఈ సారి ఎక్కువ గంటలపాటు నిలిచిపోవడం, అది కూడా ఉదయం సమయాల్లో పని చేయకపోవడంతో ఆర్థిక ఇబ్బందుల్ని చూశారు. యూపీఐ లావాదేవీలకు అలవాటు పడిన తర్వాత చాలా మంది చిన్న చిన్న పేమెంట్లకు యూపీఐ, ఫోన్‌పే ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా సగటున రోజుకు రూ.100 నుంచి రూ.లక్ష వరకు లావా దేవీలు యూపీఐ ద్వారానే చేస్తున్నారు. చిల్లర సమస్య లేకపోవడం, చెల్లించినట్లు రికార్డుపరంగా ఉండటంతో చాలా మంది వీటికి అలవాటుపడ్డారు. అత్యధిక లావాదేవీలు ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, సాయంత్రం ఆరు నుంచి తొమ్మిది గంటల వరకే ఉంటాయి. ఈ సమయాల్లోనే ఎక్కువగా సర్వర్లు మొరాయిస్తున్నాయి. అయితే ఈసారి బ్యాంకింగ్ నెట్‌వర్క్‌కు సంబంధించిన ప్రధాన సర్వర్ల వద్దే సమస్య తలెత్త డంతో అన్ని బ్యాంకుల యూపీఐలు పని చేయలేదు. దీంతో ఎండల్లో నానా ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

ఇంటర్‌లో.. అద్వితీయం



సెకండియర్‌లో 86 శాతం, ఫస్టియర్‌లో 71 శాతం మంది పాస్

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో జిల్లా విద్యార్థులు సరికొత్త రికార్డును నమోదు చేశారు. దశాబ్దకాలంలో అందుకోలేని ఉత్తీర్ణతను సైన్స్, ఆర్ట్స్ గ్రూపుల బాలబాలికలు సాధించి చరిత్రను సృష్టించారు. ఫలితాల్లో రాష్ట్ర సగటు కంటే అదనపు ఉత్తీర్ణతను అందుకున్న ఏలూరు జిల్లా విద్యార్థులు గతేడాది సాధించిన పాస్ పర్సంటేజీకి మించి 10.70శాతం అధిక ఉత్తీర్ణతతో ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో మొత్తం 86 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. జిల్లాకు రాష్ట్రస్థాయిలో ప్రథమ సంవత్సరం ఫలితాల్లో 10వ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 9వ స్థానం లభించాయి. గతేడాది కొత్తగా కొలువుతీరిన ప్రభుత్వం ఇంటర్మీడియట్ విద్యపై విద్యాసంవత్సరం ప్రారంభం నుంచే ప్రత్యేక కార్యక్రమాలతో కార్యాచరణను పకడ్బందీగా అమలు చేయడం వల్లే ఈ ఫలితాలు వచ్చాయని ఇంటర్‌బోర్డు ఆర్ఐవో యోహాన్, డీవీఈవో ప్రభాకరరావు విశ్లేషించారు. ఈ ఏడాది ఇంటర్ పరీక్షలకు ప్రథమ, ద్వితీయ సంవత్సరాల రెగ్యులర్ విద్యార్థులు జనరల్, ఒకేషనల్ విభాగాల్లో మొత్తం 30,671 మంది దరఖాస్తు చేసుకోగా, పరీక్షలు రాసిన వారిలో 23,524 మంది (77శాతం) ఉత్తీర్ణులయ్యారు. వీరిలో ప్రథమ సంవత్సరం జనరల్ విభాగం బాలబాలికలు 15,288 మందికి 10,842 మంది (71శాతం) పాస్‌కాగా, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 12,086 మందికి 10,376 మంది (86శాతం) ఉత్తీర్ణులయ్యారు. ఒకేషనల్ విభాగంలో ప్రథమ సంవత్సరం పరీక్షలకు 1,880 మంది హాజరుకాగా 1,250 మంది (66 శాతం), ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 1,417 మందికి 1,191 మంది (84శాతం) పాస్ అయ్యారు. మొత్తం మీద పరీక్షలు రాసిన 13,085 మంది బాలురలో 9,240 మంది(71శాతం), 17,586 మంది బాలికల్లో 14,419 మంది (82 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వం ఇంటర్ ఫలితాలను ఈ ఏడాది వాట్సాప్ నుంచే తెలుసుకునే వెసులుబాటు కల్పించడంపై హర్షం వ్యక్తం చేసిన విద్యార్థులు నిమిషాల వ్యవధిలోనే వేగంగా తమ మార్కులను తెలుసుకునే అవకాశం లభించింది.

15 నుంచి క్లాసులు

ఇంటర్ పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు మే 12 నుంచి 20 వరకు నిర్వహించనున్న అడ్వాన్స్ సప్లిమెంటరీ థియరీ, 28 నుంచి జూన్ 1 వరకు ప్రాక్టికల్స్ పరీక్షలు జరుగుతాయని ఆర్ఐవో యోహాన్ తెలిపారు. రెగ్యులర్ పరీక్షల ఫలితాలకు సం బంధించి రీ కౌంటింగ్ కోరుకునే విద్యార్థులు పేపర్‌కు రూ.260, రీవెరిఫికేషన్‌కు రూ.1,300 చొప్పున చెల్లించి వారు చదువుతున్న కళా శాల నుంచే దరఖాస్తు చేసుకోవాలన్నారు. సప్లిమెంటరీ పరీక్షార్థులు ఈ నెల 15నుంచి 22లోగా థియరీ పరీక్షలకు రూ.600, ప్రాక్టికల్స్‌కు రూ.275లను తమ కళాశాలలో చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. కాగా సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యే విద్యా ర్థుల కోసం ఈ నెల 15 నుంచి అన్ని కళాశా లల్లో రెమిడియల్ క్లాసు లను ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహించ డానికి ఏర్పాట్లు చేశామని డీవీఈవో ప్రభాకరరావు తెలిపారు.

సంక్షేమ విద్యార్థులు సూపర్.. హైస్కూల్ ప్లస్‌లు డీలా

జిల్లాలో మొత్తం 137 జూనియర్ కళాశాలలున్నాయి. తాజా ఫలితాల్లో ఇంటర్ పరీక్షలకు హాజరైన ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కళాశాలల ప్రథమ, ద్వితీయ సంవత్సరాల విద్యార్థులు 923 మందిలో అత్యధికంగా 856 మంది ఉత్తీర్ణులై 92.74 శాతం పాస్‌పర్సంటేజీతో అగ్రస్థానంలో నిలిచారు. ఆ తదుపరి 78 ప్రైవేటు అన్‌ఎయిడెడ్ కళాశాలల నుంచి 24,957 మంది పరీక్షలు రాయగా 79.31 శాతం ఉత్తీర్ణతతో 19,794 మంది విజయ దుందుభి మోగించారు. ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ విద్యార్థులు72.34 శాతం ఉత్తీర్ణతతో 429 మంది, 3 కేజీబీవీల నుంచి 72 మంది పాస్‌తో 70.59 శాతం, 19 ప్రభుత్వ జూనియర్ కళాశాలల నుంచి 1768 మంది ఉత్తీర్ణతతో 61.03 శాతం, 2 ఎయిడెడ్ కళాశాలల నుంచి 352 మంది ఉత్తీర్ణతతో 56.87 శాతం ఫలితాలను సాధించాయి.

'సంకల్ప్' సిద్ధించినట్టే

అధికారంలోకి వచ్చిన తొలిఏడాది నుంచే ప్రభుత్వం ఇంటర్‌విద్యపై ప్రారంభించిన ప్రత్యేక కార్యా చరణలో భాగంగా సకాలంలో పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు ఇవ్వడంతోపాటే, కళాశాలల పనివేళలను పెంచి ఉదయం 9నుంచి సాయంత్రం 5గంటల వరకు తరగతులను నిర్వహించడంతో మెరుగైన ఫలితాలు రావడానికి కారణమైందని చెప్పవచ్చు. ప్రధానంగా రాష్ట్రప్రభుత్వం ఇంటర్ విద్యార్థుల కోసం ప్రారంభించిన 'సంకల్ప్-2025' కార్యాచరణ విజయవంతమైందని తాజా ఫలితాలు రుజువు చేస్తున్నాయి. ప్రభుత్వ యాజమాన్యంలోని అన్ని కళా శాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించడం, తొలిసారిగా ఇంటర్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్, క్వశ్చన్ బ్యాంక్, కేర్ టేకర్లతో పర్యవేక్షణలో స్టడీఅవర్లు నిర్వహించడం ఉత్తమ ఫలి తాలను తెచ్చిపెట్టిందని జిల్లా ఇంటర్‌బోర్డు అధికారులు పేర్కొన్నారు.

ఇక ఇంటర్ విద్య కోసం మండలానికో హైస్కూల్ ప్లస్ చొప్పున మూడేళ్లక్రితం ప్రారంభించిన కళాశాలలు జిల్లాలో 26 ఉండగా, వీటి నుంచి ఇంటర్ పరీక్షలకు హాజరైన ప్రథమ సంవత్సరం విద్యార్థులు 409 మందిలో కేవలం 139 మంది (33.99శాతం), ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 171 మందిలో 114 మంది (66.67శాతం) ఫలితాలతో మొత్తంమీద 43.62 శాతం ఉత్తీర్ణతతో వరుసగా మూడో సంవత్సరంలోనూ అట్టడుగుస్థానంలో నిలిచాయి.

సీతారాముల కల్యాణ వైభోగం



ముదినేపల్లి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి శివారు అన్నవరం సీతారామ మారుతీ దేవస్థానంలో శనివారం స్వామివార్ల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. శ్రీరామనవమి పండుగ అనంతరం వచ్చే పౌర్ణమి రోజున నిర్వహించే ఆచార సంప్రదాయం ప్రకారం.. విన్నకోట రాఘవేంద్రరావు దంపతులతో అర్చకులు శివారెడ్డి, విన్నకోట చంద్రశేఖర్ కల్యాణం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తిలకించారు. మాజీ సర్పంచ్ విన్నకోట శ్రీహరిరావు తలంబ్రాలు, దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్త ముప్పవరపు రాఘవేంద్రరావు పట్టు వస్త్రాలను సమర్పించారు. అలాగే దేవరం సీతారామ మారుతీ మందిరంలో పౌర్ణమి సందర్భంగా సీతారాముల కల్యాణం జరిగింది. కల్యాణాన్ని పెయ్యేరు ఉపసర్పంచ్ దివి సతీష్ దంపతులు జరిపించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నా. అనంతరం అన్నదానం నిర్వహించారు.

ప్రేమ పెళ్లికి ఒప్పుకోలేదని యువతి ఆత్మహత్య !

యువకుడి మోసం వల్లేనంటూ తల్లిదండ్రుల ఆందోళన

9



అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం



9

టీవీ ప్లగ్ వద్ద షార్ట్ సర్క్యూట్
మంటలు.. కమ్మేసిన పొగ
ఐదుగురిని కాపాడిన ఫైర్ సిబ్బంది
రూ.15 లక్షల ఆస్తి నష్టం

ఆధార్.. తీరని వ్యథ!

- పుట్టినతేదీ సర్టిఫికెట్ లేక ఐరిస్ నమోదుకు ఇక్కట్లు
- జిల్లాలో 9 వేల మందికి పైబడి ఇదే సమస్య

(ఏలూరు-ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పథకాల లబ్ధి పొందాలన్న.. పాఠశాలల్లో ప్రవేశానికైనా ఆధార్‌కార్డు తప్పనిసరి.. ఆర్నెళ్ల చిన్నారుల నుంచి ఆరేళ్లు పైబడి వయస్సు వచ్చినా చాలా మందికి ఇంకా ఆధార్ కార్డులు పొందడం అందని ద్రాక్షగా మారడంతో తల్లిదండ్రులు అటు, ఇటూ పరుగులు పెట్టలేక సతమతమ వుతున్నారు. జిల్లాలో వేలాది మందికి ఈ సమస్య ఉంది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లోని శివారు కాలనీల్లో అధికంగా ఉంది. గిరిజన, సంచార జాతుల వారు ఇళ్ల వద్ద ప్రసవం జరిగాక.. ఆ వివరాలు ప్రభుత్వ కార్యాలయాల్లో అందించకపోవడంతో సమస్యలు వస్తున్నాయి. జనన ధ్రువీకరణ పత్రంతో పాటు ఏదో ఒక ధ్రువీకరణ పత్రం ఉంటేనే ఆధార్ నమోదు చేస్తామని నిర్వాహకులు చెబుతున్నారు. దీంతో పాటు వివిధ మరే ఇతర పత్రాలు లేని కొందరు పిల్లలు, వారి ప్రాథమిక హక్కును కోల్పోతున్నారు. అధికారిక ధ్రువీకరణ పత్రాలు లేక ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు పొందలేకపోతున్నారు.

కరోనా కాలంలో పుట్టినవారే అధికం

జిల్లాలో ఆధార్ కార్డుల్లేకుండా తల్లి లేదా తండ్రి ఆధార్, రేషన్ కార్డు ఆధారంగా అంగన్‌వాడీ సెంటర్లలో తొమ్మిదివేల మంది చిన్నారులు లబ్ధి పొందుతున్నారు. ఈ కేంద్రాల్లో చేరని వారి సంఖ్యను కలిపితే ఇంకా ఎక్కువ సంఖ్యలోనే ఉంటారు. ప్రధానంగా కరోనా ప్రబలిన 2021- 22 మధ్య పుట్టిన వారిలోనే ఆధార్ కార్డుల్లేని వారున్నట్లుగా గుర్తించారు. ఏలూరు నగరం, రూరల్ పరిధిలో 205 అంగన్‌వాడీ కేంద్రాలుండగా, 30 వేల మంది చిన్నారులు లబ్ధి పొందుతుండగా, ఇంకా 1,118 మందికి ఆధార్ కార్డుల్లేవు. గత నెలలో 18 నుంచి 24 వరకు ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరాలు పెట్టిన కొన్ని సచివాలయాలకే పరిమితం కావడంతో ఆశించిన సంఖ్యలో నమోదు జరగలేదు. ఇక్కడ ఆర్నెళ్ల చిన్నారుల ఐరిష్‌లు తీసినప్పుడు.. వారు అటు, ఇటూ కదలడం వల్ల ఫొటో సరిగ్గా రాకపోవడం వల్ల 15 రోజుల తర్వాత ఆధార్ నమోదులు తిరస్కరణకు గురైనవే ఎక్కువగా ఉన్నాయి. ప్రభుత్వం ఎంతమంది పిల్లలు చదువుకుంటే అంత మందికి మే నెలలో తల్లికి వందనం అమలు చేస్తామని ప్రకటించింది. ఆ లబ్ధి పొందాలంటే ఆధార్ తప్పనిసరి. ఇలాంటి వారందరికి స్పెషల్ డ్రైవ్ ద్వారా ప్రత్యేక ఆధార్ శిబిరాలను ప్రభుత్వం నిర్వహించాలన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు (ఫైల్)

సాంకేతిక సమస్యలు..



ఇటీవల మా కేంద్రాల పరిధిలో ప్రత్యేక శిబిరాలను పిల్లలను నమోదు చేయించడానికి వెళ్లాం. ఐరిష్ తీసినప్పుడు కదలికల వల్ల కొంతమంది ఆధార్ కార్డుల నమోదు తిరస్కరణకు గురయ్యాయి. తల్లిదండ్రుల ఆధార్ కార్డుల్లో ఫోన్ నెంబర్లు మార్పుల వల్ల కూడా జాప్యం జరుగుతోంది. అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు ఆధార్ నమోదుకు చర్యలు తీసుకుంటున్నాం.

\- మంగ, ఐసీడీఎస్ ఏలూరు సూపర్‌వైజర్

జిల్లాలో 9వేల మంది..



జిల్లాలో కరోనా సమయంలో పుట్టిన పిల్లలకు పుట్టినతేదీ సర్టిఫికెట్లు లేక ఆధార్ కార్డుల పొందడం సమస్యగా మారింది. ఇటువంటివారు 9వేల మంది ఉన్నట్టు గుర్తించాం. ప్రభుత్వానికి, మా శాఖ అధికారులకు పరిస్థితిని నివేదించాం. పిల్లలు పుట్టి సంవత్సరం దాటిన వారందరూ వీఆర్వో నుంచి పుట్టినతేదీ సర్టిఫికెట్లు తీసుకుంటేనే ఆధార్ నమోదు సులభం అవుతుంది.

\- పి.శారద, ఐసీడీఎస్ పీడీ

హాజరుంటేనే జీతాలు

అటెండెన్స్ మార్కింగ్ చేయని సచివాలయాల ఉద్యోగులు

ఏలూరు రూరల్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి):గ్రామ, వార్డు, సచివాలయాల ఉద్యోగులు కొందరిలో నిర్లక్ష్య ధోరణి ఇంకా పోవడం లేదు. సచివాలయ ఉద్యోగులంతా హ్యూమన్ రీసోర్స్ మేనేజ్‌మెంట్ సిస్టం పోర్టల్ యాప్‌లో లాగిన్ అయ్యి తప్పక ఇన్‌వార్డు, అవుట్ వార్డు హాజరును మార్కింగ్ చేయాలని పదే పదే ప్రభుత్వం ఆదేశిస్తున్నా కొందరిలో మార్పు రావడం లేదు. కుంటి సాకులు చెబుతూ హాజరు వేయకుండా జీతాలు డ్రా చేస్తున్నారు. దీనివల్ల సర్వీసు డెలివరీ, ప్రభుత్వ లక్ష్యాలను అధిగమించడంలో ఇబ్బందులు తలెత్తుతుండడంతో ఇక నుంచి ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సచివాలయాల వ్యవస్థ ఏర్పాటైన తర్వాత 2021లో ఫిబ్రవరి 4న రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ ఉద్యోగి తప్పకుండా బయోమెట్రిక్ అటెండెన్స్ రోజుకు రెండుసార్లు వేయాలని ఆదేశించింది. ఆ తరువాత ప్రభుత్వం హెచ్ఆర్ఎంఎస్ యాప్‌ను తీసుకుని వచ్చింది. ఇది జియో కో-ఆర్డినేట్స్ ఆధారంగా అటెండెన్స్‌ను మార్కింగ్ చేస్తుంది. ఉద్యోగి సంబంధిత సచివాలయానికి 300 మీటర్లలోపు ఉంటే అటెండెన్స్ మార్కింగ్ అవుతుంది. జాబ్‌కార్డు ప్రకారం ఇన్ వార్డు, అవుట్ వార్డు టైమింగ్స్ ఉన్నాయి. అయినప్పటికీ ఏలూరు జిల్లాలోని పలుచోట్ల కొందరు నిర్లక్ష్య ధోరణితో ఉంటూ సమయానికి వచ్చి అటెండెన్స్‌ను మార్కింగ్ చేయకుండా ఆలస్యంగా వస్తున్నారు. కొంద రైతే తీరిగ్గా మధ్యాహ్నం వచ్చి ఇన్‌వార్డు, అవుట్ వార్డు ఒకేసారి మార్కింగ్ చేస్తున్నారు. అదేమంటే తాము ఫీల్డులో ఉన్నామని, ఫలానా అధికారి పని చెప్పారని, పింఛన్ల పంపిణీ ఆలస్యమైందని కారణాలు చెబుతున్నారు.

జిల్లాలో 605 సచివాలయాలు ఉన్నాయి. 4,700 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్ (కేపీఐ)లను సక్రమంగా పర్యవేక్షించలేని పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా ప్రజలకు సర్వీసు డెలివరీ సకాలంలో చేయలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఈ కారణాలతో హెచ్ఆర్ఎం పోర్టల్‌లో అటెండెన్స్ వేస్తేనే జీతాలు చెల్లించా ల్సిందిగా ప్రభుత్వం ఆదేశించింది. ఈ విషయంలో జిల్లా కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ వహించి తరచూ సమీక్షించాలని సూచించింది. డిప్యుటేషన్‌లో మినహా మిగిలినవన్నింటినీ రద్దు చేసి సిబ్బంది సచివాలయాల నుంచే విధులు నిర్వహించాలని ప్రభుత్వం తేల్చి చెప్పింది.

ఫోన్ ఎక్కువగా చూడొద్దు అన్నందుకు కుమార్తె ఆత్మహత్య

చాట్రాయి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి):ఫోన్ ఎక్కువగా చూడొద్దని తల్లిదండ్రులు మందలించడంతో కుమార్తె మనస్థాపంతో ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన ఏలూరు జిల్లా చాట్రాయి లో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. చాట్రాయి పవర్‌పేటలో ఉదయం కూలి పనులకు వెళుతూ.. సాయంత్రం చిన్న హోటల్ నడుపుకుంటున్న మరీదు శ్రీనివాసరావు, జ్యోతి దంపతుల కుమార్తె ప్రవల్లిక విస్సన్నపేటలోని ఓ కాలేజీలో డి ఫార్మసీ మొదటి సంవత్సరం చదువుతున్నది. ఇటీవల ఆమె ఫోన్ ఎక్కువగా చూస్తుండటంతో చదువు పాడవుతుందని ఆందోళన చెందిన తల్లిదండ్రులు శుక్రవారం రాత్రి కుమార్తెను మందలించారు. దీనితో ఆమె శనివారం ఉదయం తల్లిదండ్రులు ఉపాధి హామీ పనికి వెళ్లిన సమయంలో ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై రామకృష్ణ కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి పంపారు.

నేడు ఆక్వా రైతుల సమావేశం

ఉండి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి):ఉండి-భీమవవరం రహదారిలోని కోట్ల ఫంక్షన్ హాలులో ఆదివారం ఉదయం పది గంటలకు ఉపసభాపతి కనుమూరు రఘు రామకృష్ణరాజు ఆధ్వర్యంలో ఆక్వా రైతుల జిల్లా సమావేశం నిర్వహించనున్నట్లు ఆ సంఘం ట్రెజరర్ పూసపాటి వెంకట్రాజు తెలిపారు.

రాట్నాలమ్మ ఉత్సవాలు ప్రారంభం

పెదవేగి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి):దెందులూరు నియోజకవర్గ ప్రజలందరిపై రాట్నాలమ్మ ఆశీస్సులు ఉండాలని కోరుకున్నట్టు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సతీమణి రాధారాణి అన్నారు. రాట్నాలకుంటలోని రాట్నాలమ్మ వార్షిక ఉత్సవాలను శనివారం తెల్లవారుజామున ఆమె ప్రారంభించారు. రాధారాణితోపాటు ఆలయ కమిటీ చైర్మన్ మన్నే శ్రీనివాసరావు దంపతులు అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. కమిటీ సభ్యులు రాధారాణికి పసుపు, కుంకుమ, చీరను అందించి సత్కరించారు. టీడీపీ మండల అధ్యక్షుడు బొప్పన సుధా, క్లస్టర్ ఇన్‌చార్జి మంచినేని శ్రీనివాస్, ఆలయ కమిటీ చైర్మన్ మన్నే శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు, ఈవో నల్లూరి సతీష్ కుమార్, సూపరింటెండెంట్ సత్యనారాయణ, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



కుంకుమ పూజలు చేస్తున్న రాధారాణి, తదితరులు

ఆస్తి పన్నుపై వడ్డీ రాయితీ

ఏలూరు టూటౌన్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తిపన్ను బకాయిల చెల్లించేవారికి వడ్డీరాయితీ 50 శాతాన్ని ఏప్రిల్ 30వ తేదీ వరకు పొడిగించినట్టు కమిషనర్ భానుప్రతాప్ తెలిపారు. గత నెల 25వ తేదీన వడ్డీ రాయితీని మార్చి నెలాఖరు వరకు ఇస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. తక్కువ సమయం ఉన్నందున ఎక్కువ మంది రాయితీని ఉపయోగించుకోలేదని ఏప్రిల్ 31 వరకు పొడిగించినట్టు కమిషనర్ తెలిపారు. ఈ ఏడాది 2025 - 26 సంవత్సరానికి ఆస్తిపన్ను చెల్లించేవారికి ఏప్రిల్ 30వ తేదీ లోపు ఐదు శాతం రాయితీ కల్పిస్తున్నామన్నారు.



క్షణం..క్షణం.. భయం..భయం..

ఏమాత్రం చిన్న గాలి వీచినా ఈ రెండు కొబ్బరి చెట్లు రోడ్డుకు అడ్డంగా పడిపోవడం ఖాయం.. ఏ క్షణంలో అయినా వేళ్లతో సహా నేలవాలేలా ఉన్నాయి..పెనుగొండ మండలం రామన్నపాలెం వెళ్లే రహదారిలో ఇవి ప్రమాదకరంగా మారాయి. ఈ రోడ్డులో వెళ్లేవారు ఇక్కడకు వచ్చేసరికి బిక్కు బిక్కుమంటున్నారు. - పెనుగొండ (ఆంధ్రజ్యోతి)



కొంగువారిగూడెం ఎర్రకాలువ జలాశయం వద్ద బోట్ పాయింట్ (ఫైల్)

పడకేసిన పర్యాటకం

ఎర్రకాలువ జలాశయం బోటు పాయింట్ నిలిపివేత

ఐదేళ్లుగా పట్టించుకోని పర్యాటక శాఖ అధికారులు

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : జంగారెడ్డిగూడెం మండలం కొంగువారి గూడెంలోని కరాటం కృష్ణమూర్తి ఎర్రకాలువ జలాశయం వద్ద బోటు పాయింట్ ఐదేళ్లుగా నిరుపయోగంగా మారింది. 2017 జూన్ 6న పర్యాటక శాఖ ఆధ్వర్యంలో బోటు షికారు చేసేందుకు బోటు పాయింట్‌ను అప్పటి చింతలపూడి ఎమ్మెల్యే పీతల సుజాత ప్రారంభించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు సేద తీరడానికి జలాశయం ప్రారంభంలో ఒక టూరిస్టు భవనం కూడా ప్రారంభించారు. ప్రస్తుతం టూరిస్టు భవనం ప్రైవేటు వారికి అద్దెకు ఇచ్చారు.మద్ది ఆంజనేయస్వామి ఆలయం, జంగారెడ్డిగూడెం గోకుల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి ఆలయం, బుట్టాయగూడెం గుబ్బల మంగమ్మ ఆలయాలకు వచ్చే భక్తులు ఇక్కడకు వచ్చి పర్యాటక శాఖ వారు ఏర్పాటు చేసిన భవనంలో బస చేసేవారు. సరదాగా బోటు షికారు చేసేవారు. ఎర్రకాలువ జలాశయం పర్యాటకులతో సందడిగా ఉండేది. 2019 వరకు బాగానే నడిచింది. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం బోట్ పాయింట్‌ను పూర్తిగా నిర్వీర్యం చేసింది. పర్యాటక శాఖ కూడా పట్టించుకోలేదు. ఇటీవల జంగారెడ్డిగూడెం విచ్చేసిన రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ జంగారెడ్డిగూడెం ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. బోటింగ్ పాయింట్ పెట్టించాలని మంత్రి కందుల దుర్గేష్‌తో మాట్లాడతానని డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు అన్నారు. మద్ది ఆంజనేయ స్వామి ఆలయం నుంచి ఎర్రకాలువ జలాశయం వద్దకు డైరెక్టు రోడ్డు నిర్మించాలని ప్రపోజల్ పెడతామన్నారు. ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి చేయడానికి ఎన్నో అవకాశాలున్నాయి.

ఆమె చదివింది ఆర్థిక శాస్త్రం.. ఆ విజ్ఞానంతో సమాజానికి ఎంతోకొంత సేవ చేయాలని అనుకుంది.. తన రచనల ద్వారా సమాజ వికాసానికి చేయూత అవ్వాలని భావించింది.. 21 ఏళ్లకే సున్నితమైన అంశంతో ఆమె రాసిన పుస్తకం వైద్యులు, మానసిక తత్వవేత్తల ప్రసంశలు అందుకుంటున్నది..అంతేకాదు..విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచేందుకు 'ఇన్నోవేషన్ క్లాస్ రూమ్స్' అనే స్టార్టప్ కంపెనీని రెండు తెలుగు రాష్ట్రాల్లో స్వయంగా ప్రారంభించారు.. తణుకు పట్టణానికి చెందిన రామ్ ప్రియాంక రచించిన 'ది బ్యాలెన్స్ విదిన్' పుస్తకం ఇటీవల హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆంధ్రజ్యోతి ఆమెతో ముచ్చటించింది..పుస్తక నేపథ్యం.. సామాజిక అంశాలు..నేటి విద్యార్థులకు ఏమి అవసరం వంటి విషయాలపై ఆమె వివరించారు... - తణుకు రూరల్ (ఆంధ్రజ్యోతి)



మనమేంటో మనకే తెలుసు..

మాది వ్యవసాయ కుటుంబం..మా నాన్న ఈడ్పుగంటి శేషగిరి 25 ఏళ్లకే ఉండ్రాజవరం మండలం మోర్త గ్రామ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. నేను ముస్సోరిలో ముస్సోరి ఇంటర్నేషనల్ స్కూళ్లో విద్యాభ్యాసం పూర్తి చేశాను. మణిపాల్ యూనివర్సిటీ నుంచి ఫైనాన్షియల్ ఎకనామిక్స్‌లో డిగ్రీ చేశాను. నేను చదివిన చదువు ఈ సమాజానికి ఎంతోకొంత ఉపయోగపడాలనే ఉద్దేశంతో రచనలు చేయడం ప్రారంభించాను.ప్రముఖ ఇంగ్లీష్ రచయితలు స్టీవెన్ బార్లెట్, జేమ్స్ క్లియర్ రచనలు అంటే ఇష్టం. ది బ్యాలన్స్ విదిన్ ఇంగ్లీషు నవల ప్రధానంగా మనుషుల మధ్య ఉండే భావోద్వేగాలను ప్రస్ఫుటం చేస్తుంది. చదవడం ఒక ప్రయాణం లాంటిది.. ఈ పుస్తకం మనల్ని మనం కొత్తగా కనుగొనడానికి దోహదం చేస్తుంది..అని చెప్పవచ్చు.. ఆర్థికశాస్త్ర అధ్యయనం ద్వారా సంపాదించిన విజ్ఞానంతో రెండు స్టార్టప్ కంపెనీలను స్థాపించాను. పాఠశాలలో చదివే విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో "ఇన్నోవేషన్ క్లాస్ రూమ్స్" ప్రారంభించాను..

భావోద్వేగాలను అదుపు చేసుకోవాలి

మనలో వుండే ఉద్వేగాలను మనమే అదుపు చేసుకోవాలి. అలసత్వం, గతానికి సంబంధించిన విషయాల పట్ల గిల్టీగా వుండటం, మనపై మనకి నమ్మకం లోపించడం వంటి విషయాలు మన జీవితంపై ఎలా ప్రభావం చూపుతాయో ఈ పుస్తకంలో వివరించాను. ఆలస్యం, అలసత్వం వల్ల నష్టపోయిన జీవితం ఎంత విలువైనదో ఈ పుస్తకం చెబుతుంది. " నీ గతం మొత్తం నీ భవిష్యత్‌లోకి రావలసిన అవసరం లేదు. అవసరం లేకుండా అన్నింటినీ నియంత్రించాలనే తాపత్రయం వదలి పెట్టాలి.." మనిషిలో రెండు రకాల భావోద్వేగాల మధ్య సమన్వయమే ఈ పుస్తక ముఖ్య ఉద్దేశ్యం. ఇది సాధారణ నవల కాదు...మన జీవితంలో సమతుల్యత మనలో వుంటుంది. బయట ఎవరితోనూ కాదు. ఎవరైనా వచ్చి మన జీవితాన్ని మార్చేస్తారేమో అనుకోవడం కన్నా మనమే మనలో మార్పు తెచ్చుకోవాలి. బలమైన మనస్తత్వం వల్ల ఎన్ని ఆటంకాలు వచ్చినా ఇంకా బలంగా మారతాం.మన జీవితం ఒక లైన్ కాదు..ఒక గ్రాఫ్ లాంటిదని మన గుర్తించాలి..జీవితంలో వచ్చే ప్రతీ ఎమోషన్స్, రిలేషన్స్ గురించి ఈ నవల ద్వారా చెప్పాలనుకున్నా.

భావోద్వేగాల సమన్వయం.. 'ది బ్యాలెన్స్ విదిన్' లక్ష్యం

పుస్తక రచయిత రామ్ ప్రియాంక



విద్యార్థుల భవిష్యత్తు పునాది.. ఇన్నోవేటివ్ క్లాస్ రూమ్స్..

విద్యార్థుల్లో విద్య ద్వారా సామర్థ్యాలను పెంపొందించే లక్ష్యంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎదుగుతున్న సంస్థ " ఇన్నోవేటివ్ క్లాస్ రూమ్స్." మన దేశ ప్రజల్లో తెలివితేటలు, సమర్థత వున్నా టెక్నాలజీ అందుబాటులో లేకపోవడం వల్ల చాలామందికి అవసరమైన అవకాశాలు అందడం లేదు. ఈ లోపాన్ని సరి చేసేందుకు ఇన్నోవేటివ్ క్లాస్ రూమ్స్ పని చేస్తుంది. ఇది పాఠాలు బోధించే ప్లాట్‌ఫాం కాదు. ఇది భవిష్యత్‌పై దృష్టిపెట్టే శిక్షణా సంస్థ. పాఠశాలలు, కళాశాలలో బోధించే పాఠ్యాంశాల కంటే రేపటి ప్రపంచానికి సిద్ధంగా వుండే నైపుణ్యాలను అందించే శిక్షణా సంస్థ. ఇప్పటి పిల్లలు తమను తాము విగిలిన సమాజంతో కలవకుండా మొబైల్ ఫోన్లలోనే ఆటలు, పాటలు అన్నీ. వీటివల్ల తోటి ప్రజలతో సంబంధ బాంధవ్యాలు లేకపోవడం, కనీస మానవ సంబంధాలు కూడా రాబోయే రోజుల్లో తగ్గిపోయే ప్రమాదం ఉంది. నేటి బాలలను సమాజంతో మమేకం చేయాలనే లక్ష్యంతో ఈ సంస్థను ఏర్పాటు చేశాం. ఇన్నోవేషన్ క్లాస్‌రూమ్స్ ద్వారా భవిష్యత్ ఒక కల కాకుండా ఒక కలను సాకారం చేసుకునే మార్గంగా నిలవాలి. విద్యార్థులను సమాజంలో భాగస్వాములు చేస్తూ విద్యా బోధన సాగాలి. చాలా పాఠశాలల్లో విద్యార్థులు మార్కులు, ర్యాంక్‌లకే పరిమితమవుతున్నారు. నేటి విద్యార్థులకు పురాణ, ఇతి హాసాలతో పాటు భగవద్గీత, రామాయణం వంటి వాటిని బోధిస్తూ ఆధునిక టెక్నాలజీపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా ఈ సంస్థ పని చేస్తుంది.



హైదరాబాద్‌లో ది బ్యాలెన్స్ విదిన్ పుస్తకావిష్కరణ దృశ్యం (ఫైల్ ఫోటో)

ఉద్వేగాల అదుపు గురించి వివరిస్తుంది



మనలో వుండే అనేక ఉద్వేగాలను ఎలా అదుపులో వుంచు కోవాలో ఈ పుస్తకంలో అర్థమయ్యే రీతిలో వివరించారు. మనలో చిన్న విషయాలను మంచిగా గమనిస్తే మంచి అభిప్రాయం ఏర్పడుతుంది. ఎవరికి వారే వ్యక్తిగతంగా బ్యాలెన్స్‌ను పాటించేలా ఈ పుస్తకంలో వివరించారు. ప్రతీ వ్యక్తి తనలో తన గురించి మంచి చెడులను విచక్షణ పాటించేలా ఉపయోగపడే పుస్తకంగా నిలుస్తుంది.

- డాక్టర్ శిల్పారెడ్డి, కిమ్స్ డైరెక్టర్, హైదరాబాద్

బ్యాలెన్స్‌డ్‌గా ఉండడం తెలుస్తుంది




ప్రతీ వ్యక్తిలో వుండే ఇంటరాక్షన్ బాలెన్స్ గురించి ఈ పుస్తకంలో బాగా వివరించారు. కొందరు తెలియకుండా వారిలో వుండే ఉద్వేగాలను బ్యాలెన్స్ చేసుకోగలుగుతారు.. కొందరు చేసుకోలేరు. అలాంటి వారి కోసం ఈ పుస్తకం ఉపయోగపడు తుంది. కొన్ని ఉద్వేగాలు వాటంతటవే బ్యాలెన్స్ లేకుండా బయటకువస్తాయి. బ్యాలెన్స్‌కు సంబంధించిన విషయాలు ఈ పుస్తకంలో చక్కగా వివరించారు.

-షఫీ, సినీనటుడు, హైదరాబాద్

పోక్సో .. ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ అఫెన్సెస్.. అభు శుభం తెలియని చిన్నారులు, యువతులపై లైంగిక వేధింపులకు పాల్పడితే ఈ చట్టం ప్రకారం కేసులు నమోదు చేయవచ్చు.. అయితే ఎంతో పకడ్బందీగా ఏర్పాటు చేసిన ఈ చట్టం వ్యక్తిగత కక్షలు, రాజకీయ జోక్యంతో దుర్వినియోగం అవుతోందని విమర్శలు వస్తున్నాయి. చట్టంపై పూర్తి అవగాహన లేకపోవడంతో టీనేజ్‌లో ఆకర్షణకు లోనై ప్రేమలో పడుతున్నారు. సాధారణంగా 16 నుంచి 18 ఏళ్లలోపు వయసువారే ఆకర్షణకు గురై ప్రేమలో పడుతూ పోక్సో కేసుల్లో ఇరుక్కుంటున్నారు. ఇటీవల విడుదలైన కోర్టు సినిమాలో చట్టాన్ని ఎలా పక్కదారి పట్టిస్తున్నారనే విషయాన్ని చూపించారు..

రక్షణ ఉందా ?



బాలికలు,మహిళల రక్షణకు పోక్సో

అయినా ఆగని అఘాయిత్యాలు

ఎక్కడికక్కడ కేసులు నమోదు

చట్టం దుర్వినియోగం అవుతోందంటూ విమర్శలు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : 2012 మే 22న భారత పార్లమెంటులో ఈ చట్టం ఆమోదించగా అదే ఏడాది నవంబర్ 14 బాలల దినోత్సవం పురస్కరించుకుని అమలుకు శ్రీకారం చుట్టారు. లైంగిక నేరాల నుంచి చిన్నారులకు రక్షణ కల్పించేందుకు ఈ చట్టం రూపొందించారు. 18 ఏళ్ల లోపు బాలబాలికలకు ఈ చట్టం వర్తిస్తుంది. బాల బాలికలపై లైంగిక దాడులు,ఇతర వేధింపులు జరిగితే ఖచ్చితంగా పోక్సో చట్టం ప్రకారం వారిపై కేసు నమోదు చేసి శిక్ష విధిస్తారు. 18 ఏళ్లలోపు వారు ఇష్టపూర్వకంగా లైంగి కంగా కలిసినా ఈ చట్ట ప్రకారం నేరమే. అమ్మాయి, అబ్బాయి ఇంట్లో నుంచి వెళ్లిపోతే వారు మైనర్లు అయితే ఖచ్చితంగా పోక్సో చట్ట ప్రకారం కేసు నమోదు చేస్తారు. తల్లిదండ్రులు ఇరువైపులా రాజీ అయినా కేసు మాత్రం నమోదు చేస్తారు. చిన్న పిల్లలపై అఘాయిత్యాలపై రాజీ అయ్యే సమస్యే లేదని ప్రభుత్వం కఠినంగా ఈ చట్టాన్ని తయారు చేసింది.

తెలిసిన వారే నేరస్తులు

అభ శుభం తెలియని పిల్లలను తెలిసిన వారే అక్కున చేర్చుకున్నట్లు నటిస్తూ వారిపై లైంగిక దాడులకు పాల్పడుతున్నారు. చాక్లెట్స్, బిస్కెట్లు ఆశ చూపించడం, టీవీలో సినిమాలు వస్తున్నాయంటూ ఒంటరిగా బాలికలను ఇంట్లోకి పిలిచి అఘాయిత్యాలకు పాల్పడడం జరుగుతూనే ఉన్నాయి. బంధువులే కదా అని నమ్మి పంపిస్తే ఆ బిడ్డలపైనే దాడులకు పాల్పడుతున్నారు. ఏలూరులోని సత్రంపాడులో మారుటి తండ్రి అప్పటికే తాను సహజీవనం సాగిస్తున్న మహిళకు ఇద్దరు కుమార్తెలు ఉండడంతో వారిద్దరిపై సంతానం కోసం అత్యాచారానికి పాల్పడ్డాడు. వారికి పిల్లలు కూడా పుట్టారు. ఈ సంఘటనపై ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయడంతో మారుడి తండ్రికి, ఆ బాలికల తల్లికి జీవిత ఖైదు గతేడాది విధించారు. ఏలూరు నగరంలోనే ఆర్ఎంపీ వైద్యుడు ఒకరు మాయ మాటలు చెప్పి తొమ్మిదేళ్ల బాలికపై లైంగిక దాడులకు పాల్పడ్డాడు. తల్లి దండ్రులు మందలించారని ఇంటి నుంచి బస్టాండ్‌కు వచ్చిన ఒక బాలికకు ఆటోడ్రైవర్ రాత్రివేళ మాయమాటలు చెప్పి ఆమెను ఇంటి వద్ద దించుతానని తన ఇంటికి తీసుకువెళ్ళి లైంగిక దాడికి ప్రయత్నించగా ఆ బాలిక తప్పించుకుని ఆ ప్రాంతంలో ఉన్న హిజ్రాల వద్దకు చేరింది. హిజ్రాలు ఆ బాలికను కాపాడి బాలిక తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. ఈ సంఘటనపై ఏలూరు త్రిటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. జిల్లాలో వెలుగులోకి రాని ఎన్నో కేసులు ఉంటానే ఉన్నాయి. అల్లరి అయిపోతామనే భయంతో చాలామంది బయటకు రానివ్వరు..

చట్టం దుర్వినియోగం ?

బాలిబాలికల రక్షణార్థం ఎంతో పకడ్బందీగా ఏర్పాటు చేసిన పోక్సో చట్టాన్ని కొంతమంది రాజకీయ, వ్యక్తిగత కక్షలతో దుర్వినియోగం చేస్తున్నారనే విమర్శలు కూడా ఉన్నాయి.



నిష్పక్ష పాతంగా దర్యాప్తు చేయాల్సిన పోలీసులు కూడా ఒత్తిళ్ళకు తల వంచి ఆ చట్టాన్ని యధావిధిగా ప్రయోగించేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఈ చట్టంపై పూర్తిస్థాయిలో ప్రజల్లో, విద్యార్థుల్లో అవ గాహన కల్పించ కుండానే అమలు చేస్తున్నారనే విమర్శలు కూడా వస్తున్నాయి. గ్రామస్థాయిలోనూ, పాఠశాలలు, విద్యాసంస్థలు, కాలే జీల్లోనూ పూర్తిస్థాయి అవగాహన కలిగించి నప్పుడే ఈ చట్టంలో నిబంధనలను, శిక్షలను అవగాహన చేసుకుని క్రమ శిక్షణతో ఉంటారని విజ్ఞులు చెప్తున్నారు.

తప్పు చేస్తే శిక్ష తప్పదు



పద్దెనిమిది ఏళ్ళలోపు బాలబాలికలపై ఎవరైనా వేధింపులకు, లైంగిక దాడు లకు, మరే ఇతర చర్యలకు పాల్పడితే కఠినంగా శిక్షిస్తారు. పోక్సో చట్టంపై ఇప్పటికీ జిల్లా ఎస్పీ కిషోర్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పాఠశాలలు, కళాశాలలు, విద్యా సంస్థల్లో విద్యార్థినులకు అవగాహన, చైతన్యం కల్పిస్తున్నాం. ఆపద సమయంలో పోలీస్ సహాయం ఎలా పొందాలో వివ రిస్తున్నాం. ఆపద సమయంలో 112కు కాల్ చేయాలని తెలియ జేస్తున్నాం. బాల్య వివాహాలు జరిగితే 1098కు సమాచారం ఇవ్వాలని చెప్తున్నాం. గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పిస్తున్నాం. ఈ ఏడాది ఇప్పటి వరకూ పోక్సో కేసుల్లో ఐదు తీర్పులు రాగా అన్నిటిలోనూ జీవితఖైదులు పడ్డాయి. పోక్సో చట్టం కఠినంగా ఉండ డంతో బాలికలకు రక్షణగా ఉంటుంది.

- ఎం.సుబ్బారావు, ఇన్‌స్పెక్టర్, మహిళా పోలీస్ స్టేషన్, ఏలూరు

అయినా..ఆగని వేధింపులు

భీమవరం క్రైం (ఆంధ్రజ్యోతి) : మహిళ అర్ధరాత్రి ఒంటరిగా రోడ్డుపై నడిచివెళ్లినప్పుడే అసలైన స్వాతంత్ర్యం వచ్చినట్లు అని ఆనాడు బాపూజీ చెప్పిన మాటలు ఇప్పటికీ ఆచరణ యోగ్యం కాలేదు... పట్టపగలే ఒంటరిగా వెళ్లలేని పరిస్థితులు ఉన్నాయి. మహిళలకు రక్షణ కరువైంది. ఇక చిన్నారుల పరిస్థితి అయితే చెప్పనక్కరలేదు. పసిపిల్లలు అని చూడకుండా లైంగిక దాడులకు పాల్పడుతున్నారు. ఇలాంటి సంఘటనలు నిత్యం జిల్లాలో ఏదో ఒకచోట బహిర్గతమవుతూనే ఉన్నాయి. పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేసినా బెయిల్‌పై వచ్చి ఘాతుకాలకు పాల్పడుతున్నారు.

- ఇటీవల నరసాపురం పట్టణానికి చెందిన ఒక వ్యక్తికి భీమవరం పోక్సో కోర్టు జీవితఖైదు, రూ. 55 వేలు జరిమానా విధించింది. ఇరగవరం పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక వ్యక్తి భీమవరం పోక్సో కోర్టు ఏడేళ్ళ జైలు శిక్ష రూ. 30 వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది.
- భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక గ్రామంలో సుమారు నెల రోజుల క్రితం కన్న తండ్రే కన్న కూతురిపై అత్యాచారానికి ఒడిగట్టాడు. ఒంటరిగా ఉన్న చిన్నారిపై తండ్రి రాక్షసత్వం ప్రదర్శించారు. రూరల్ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు.
- పాలకోడేరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక బాలికపై వరుసకు సోదరుడైన వ్యక్తి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఎవరూ లేని సమయంలో ఇంట్లోకి పిలిచి చాక్లెట్ ఇస్తానని మాయమాటలు చెప్పి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక ఏడ్చుకుంటూ ఇంటికి వెళ్ళడంతో అనుమానం వచ్చిన తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.
- తాడేపల్లిగూడెం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక బాలికపై సుమారు 60 సంవత్సరాలు ఉన్న వృద్ధుడు ఆడిస్తానంటూ ఎత్తుకుని ఇంట్లోకి తీసుకువెళ్ళి అత్యాచారానికి ప్రయత్నించగా బాలిక కేకలు వేయడంతో స్థానికులు ఆ వృద్ధుడికి దేహశుద్ధి చేశారు.అనంతరం పోలీసులకు అప్పగించారు.

అవగాహన కల్పిస్తున్నాం : డీఎస్పీ జయసూర్య



అభం శుభం తెలియని చిన్నారులపై అత్యాచారాలు, లైంగిక వేధింపులు పెరిగాయి. అటువంటి సంఘటనలపై వెంటనే కేసులు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేస్తున్నాం. తల్లిదండ్రులు కూడా చిన్నారులను జాగ్రత్తగా చూసుకోవాలి. పోలీసు శాఖ బ్యాడ్ టచ్.. గుడ్ టచ్ అనే అంశాలను పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కల్పిస్తున్నాం.



వేమగిరి కొండపై బౌద్ధ క్షేత్రం

నేడు 84 అడుగుల బుద్ధుని విగ్రహావిష్కరణ

కడియం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కడియం సమీపంలోని వేమగిరి కొండపై పోలీసు విశ్రాంత ఉద్యోగి యార్లగడ్డ జగదీశ్వరరావు బౌద్ధ క్షేత్రాన్ని నిర్మించారు. ఇందులో బుద్ధుని 84 అడుగుల విగ్రహావిష్కరణ ఆదివారం జరగనుంది. ఉండ్రాజవరం బౌద్ధ కేంద్రం బౌద్ధ భిక్షువు అనలియో, కర్నాటక బైలుకుప్పం ప్రాంతంలోని బౌద్ధ కేంద్రానికి చెందిన భిక్షువులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు విశిష్ట అతిథులుగా హాజరు కానున్నారు.



ఉద్యోగం చేసిన కాలం నుంచే..

ఉద్యోగ జీతానికి తోడు మరికొంత రుణం చేసి జగదీశ్వరరావు వేమగిరిలో 1996లో కొంత స్థలాన్ని కొనుగోలు చేశారు. 1998లో మరో 73 సెంట్లు స్థలం కొని ఆనాటి నుంచి బౌద్ధ క్షేత్రానికి ఏర్పాట్లు చేయడం మొదలుపెట్టారు. 2013లో స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. 2013లో బుద్ధుని విగ్రహ రూపకల్పనకు శిల్పులు పనులు ప్రారంభించారు. 84 అడుగుల విగ్రహం ఏర్పాటు చేశారు. బుద్ధ విగ్రహం కింద చుట్టూరా ధర్మహాలు ఏర్పాటు చేశారు. దీంట్లో బౌద్ధం, చరిత్ర, సాహిత్యం వంటి అనేక రచనలకు సంబంధించిన పుస్తకాలను భద్రపరిచారు.

మహనీయుల చరిత్రలు చదివి బుద్ధిజం వైపు అడుగులు

బుద్ధిజం గొప్పదని ఆనాడు మహనీయుడు గురజాడ అన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, రాహుల్ సాంకృత్యాయన్, భారతదేశ చారిత్రక పితామహుడు డీడీ కోశాంబి వంటి మహనీయుల రచనలు చదివి నేను బుద్ధిజం వైపు అడుగులు వేశాను. హేతువాదం, నాస్తికత్వం, సైన్సు, తత్వశాస్త్రాల్లో పలు రచనలు చేశా. ప్రవక్తలు, తత్వవేత్తలు, శాస్త్రవేత్తలు, సంఘ సంస్కర్తలు, విప్లవకారులు, త్యాగధనుల చరిత్రలు చదివాను.

- మహోదయ యాజరా, బుద్ధ విహార్ వ్యవస్థాపకుడు

నిర్మానుష్యంగా మొగల్తూరు జాతీయ రహదారి.. నరసాపురం 217 జాతీయ రహదారి

అమ్మో..ఎండలు..

మొగల్తూరు/నరసాపురం ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): శనివారం సూర్యుడు తన ప్రతాపాన్ని చూపించాడు. ఉదయం 11 గంటలకే ఎండ వేడిమితో పాటు వేడిగాలలు వీస్తుండటంతో ప్రజలు బయటకు రాని పరిస్థితి నెలకొంది. రోహిణి కార్తె రాకముందే ఎండలు మండి పోతున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఎండ విపరీతంగా కాయడంతో మొగల్తూరు గ్రామం మీదుగా విస్తరించిన జాతీయ రహదారి నిర్మానుష్యంగా మారింది. నిత్యం రద్దీగా ఉండే 216 రహదారి రాకపోకలు లేక నిర్మానుష్యంగా మారింది. వాతావరణ మార్పులతో చిన్నారులు, వృద్ధులు జ్వరాల బారిన పడుతున్నారు.



ఆచంట హైస్కూల్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర పరిశీలకుడు ఇస్మాయేలు

పాఠశాలల్లో స్టూడెంట్స్ కిట్స్ స్టాక్ పాయింట్ల పరిశీలన

ఆచంట/ ఇరగవరం/ అత్తిలి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రానున్న విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యార్థులకు ఇచ్చే సర్వేపల్లి రాధా కృష్ణన్ విద్యార్థి మిత్ర స్టూడెంట్స్ కిట్స్ భద్రతకు సంబంధించి శనివారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో గల స్టాకు పాయింట్లను రాష్ట్ర పరిశీలకుడు డాక్టర్ టీఎంటీ ఇస్మాయేలు,జిల్లా సీఎంవో చంద్రశేఖర్ పరిశీలించారు. ఆచంట హైస్కూల్‌లో మాట్లాడుతూ మండల క్లస్టర్స్ రిసోర్సు మొబైల్ టీచర్స్ వివిధ పాఠశాలలో పని చేస్తున్న పార్ట్‌టైమ్ ఇనస్ట్రక్టర్లతో కిట్స్‌ను ప్రతీ విద్యార్థికి అందించడలో సమర్థవంతంగా ఎలా నిర్వహించాలో వివరించారు. ఎంఈవో రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు. ఇరగవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో పరిశీలించి మాట్లాడుతూ స్టాక్ గదుల్లోకి వర్షపు నీరు రాకుండా చేసుకోవాలని, తలుపులు చెదలు పట్టకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా కమ్యూనిటీ అధికారి చంద్రశేఖర్, ఇరగవరం ఎంఈవో -2 జీబీవి ప్రసాదరావు, హెచ్‌ఎం నాగమణి,కె.గోపాలకృష్ణ వెంకటరావు, ఎస్‌కె అబ్దుల్లా పద్మ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అత్తిలిలో విద్యార్థుల కిట్లకు సంబంధించిన విధివిధానాలు తెలియజేశారు. సక్రమంగా పంపిణీ చేయాలని కోరారు. మండల విద్యాధికారి-2 ప్రసాద్, బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం విజయలక్ష్మి పాల్గొన్నారు.



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న రమణారావు

నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ రమణారావుకు ఉగాది పురస్కారం

తాడేపల్లిగూడెం అర్బన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) :ఏపీ నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ. రమణారావు కిన్నెర - విశ్వావసు ఉగాది పురస్కారం అందుకున్నారు. సివిల్ ఇంజనీరింగ్‌లో విశిష్ఠ సేవలు అందించినందుకు ఈయన ఈ అవార్డును సొంతం చేసుకున్నారు. ఇటీవల హైదరాబాద్ రవీంద్ర భారతిలో నిర్వహించిన ఉగాది పురస్కారాల వేడుకలలో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు.నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పీ.దినేష్‌శంకర్‌రెడ్డి, డీన్‌లు డాక్టర్ జి.రవికిరణ్ శాస్త్రి, డాక్టర్ వీ.సందీప్, డాక్టర్ ఎన్.జయరాం, డాక్టర్ హిమబిందు, డాక్టర్ కార్తీక్ తదితరులు రమణారావుకు అభినందనలు తెలిపారు.

అండర్ -19 క్రికెట్‌కు సరిపల్లి యువకుడి ఎంపిక

నరసాపురం టౌన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): నరసాపురం మండలం సరిపల్లి గ్రామానికి చెందిన వెల్లిగట్ల వెంకట నాగమధు ఇండో-నేపాల్ ఇంటర్నేషనల్ 2025 అండర్-19 క్రికెట్‌కు ఎంపికయ్యారు. మధును ప్రభుత్వ విప్ నాయకర్ అభినందించారు. వచ్చిన అవకాశాన్ని వినియోగించుకుని మరింత ముందుకు సాగాలని నాయకర్ ఆకాక్షించారు. అనంతరం మండలంలోని చిట్టవరం గ్రామానికి చెందిన ఈదా ప్రభుదాసుకు రూ 4.5 లక్షల ఎల్‌ఓసీ పత్రాన్ని అందించారు. పార్టీలకు అతీతంగా దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి సీఎం రిలీఫ్ ఫండ్‌ను అందిస్తామన్నారు.



ఎంపికైన మధును అభినందిస్తున్న విప్ నాయకర్

ఇసుక దందా!



పాలకొల్లు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : ఇసుకను యథేచ్ఛగా దోచేస్తున్నారు. నిబంధనలు తుంగలోకి తొక్కి యంత్రాలతోనే ఎగుమతి చేస్తున్నారు. నిర్ణీత ధర ప్రమేయం లేకుండా లారీకి రూ.20 వేలు వసూలు చేస్తున్నారు. పాత పశ్చిమ గోదావరి జిల్లాలోని పెండ్యాల, పందలపర్రు, తీపర్రు ర్యాంపుల్లో రోజుకి సుమారు 200 లారీలు ఇసుక ఎగుమతి అవుతుంది. ఈ ర్యాంపుల్లో ఇసుక ఎగుమతికి యంత్రాలను ఉపయోగించి నప్పటికీ లారీ ఇసుకకు రూ.20 వేలు వసూలు చేస్తున్నారు. వాస్తవానికి అయా ర్యాంపులను బట్టి రూ.1600, రూ.1800 , రూ.2000 వసూలు చేయాలి. అయితే ఎగుమతి అయిన ఇసుకకు ఏ విధమైన రసీదులు ఇవ్వకుండా రూ.5 వేలు చొప్పున వసూళ్లు చేస్తూ సుమారు 200 లారీలకి రూ.10 లక్షలు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. మూడు ర్యాంపుల్లో నెలకి సుమారు రూ.3 కోట్లు మింగేస్తున్నారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని మల్లేశ్వరం ర్యాంపులో పగలూ, రాత్రి యంత్రాల ద్వారా ఇసుక తవ్వేస్తున్నారు. ఈ ఒక్క ర్యాంపులోనే 200 లారీలు పైబడి ఇసుక ఎగుమతి అవుతుండగా ఈ ర్యాంపులో నెలకి రూ.3 కోట్లు ఇసుక మాఫియా చేతికి వెళ్లుతున్నట్లు సమాచారం.

అక్రమ వసూళ్లపై అనుమానాలెన్నో

మరో రెండు నెలల వ్యవధిలో గోదావరికి వరదలు పలకరించే పరిస్థితి ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు స్టాక్ పాయింట్లలో ఇసుక నిల్వ చేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మరో వైపు అక్రమ ఎగుమతుల ద్వారా కోట్లాది రూపాయలు సొమ్మును ఇసుకాసురులు బుక్కేస్తున్నప్పటికీ ప్రభుత్వ పెద్దలు పెదవి విప్పక పోవడం పలు అనుమానాలకు దారితీస్తున్నది. ఐదు యూనిట్ల ఇసుక పేరుతో సుమారు 6 యూనిట్లు ఇసుక ఎగుమతి చేస్తున్నారు. వినియోగదారులకు చేరేటప్పటికీ జిల్లాలో అయా ప్రాంతాలను బట్టి లారీ ఇసుక రూ.9,500 నుంచి రూ.10,500 మధ్యలో అందిస్తున్నారు. గతంతో పోలిస్తే ధరలు కొంత తగ్గినప్పటికీ ర్యాంపుల్లో నిర్ణీత ధరకే ఇసుక ఇస్తే 5 యూనిట్లు ఇసుక రూ.7 వేలకు అందించగలమని లారీ యజమానులు చెబుతున్నారు.

ర్యాంపుల్లో అక్రమ వసూళ్లు
రోజుకు రూ.20 లక్షల దోపిడీ
దోపిడీ సొమ్ము ఎవరి జేబులోకి ?
6 యూనిట్ల ధర రూ.10 వేలు
మల్లేశ్వరం ర్యాంపులో
రాత్రీ, పగలూ ఎగుమతులు

ర్యాంపులలో అక్రమ వసూళ్లపై అధికార పార్టీకి చెందిన కొందరు ప్రజాప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ వసూళ్లు ఇలాగే కొనసాగితే తమ పార్టీకి అప్రతిష్ఠ వస్తుందని కూటమిలోని పలువురు నాయకులు వ్యాఖ్యానించడం గమనార్హం. జగన్‌రెడ్డి హయాంలో ఇసుక ధరలతో పోలిస్తే ఇప్పుడు ధరలు అందుబాటులోనే ఉన్నాయి. అయితే ఉచితమని చెప్పి ర్యాంపులలో లారీకి రూ.5 వేలు అక్రమంగా వసూలు చేయడం పట్ల వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు కిరాయిలు కిట్టుబాటు అవడం లేదంటూ లారీ యజ మానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ర్యాంపులలో నిర్ణీత ధర తీసుకుంటే తాము కొంత కిరాయికి ఇచ్చినప్పటికీ వినియోగదారులకు పెద్దగా భారం ఉండదని, ర్యాంపులలో అక్రమ వసూళ్లను అరికట్టాలని వినియోగదారులు, లారీ యజమానులు కోరుతున్నారు.

తగ్గిన వినియోగం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని వర్గాల ప్రజలకు ఇసుక ఉచితమని ప్రకటించింది. ఉచితం చివరకు ఊత పదంగానే మిగిలింది. ఇసుక దోపిడీ జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పెదవి విప్పడం లేదు. అక్రమ వసూళ్ల వెనుక అధికార పార్టీకి చెందిన నాయకుల అండదండలు ఉన్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో పోలిస్తే ఇప్పుడు ఇసుక వినియోగం ఐదింట రెండింతలు తగ్గింది. నవ్యాంధ్ర ఏర్పడిన తొలినాళ్లలో పాత పశ్చిమగోదావరి జిల్లాలో రోజుకి వెయ్యి లారీలు ఇసుక వినియోగించేవారు. ఇప్పుడు వినియోగం 400 లారీలకు పడిపోయింది.

కొండపై కూల్..కూల్‌గా



తాత్కాలికంగా ఏర్పాటు చేసిన చలువ పందిరి

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): సూర్యుడు భగ్గుమంటున్నా ద్వారకాతిరుమల కొండపై ఆపసోపాలు పడాల్సిన పనిలేదు. ఎందుకంటే వేసవి తాపం నుంచి రక్షణకు దేవస్థానం పలు చర్యలు చేపట్టింది. భక్తులు రాకపోకలు సాగించే ప్రధాన రాజగోపురం మెట్లదారిలో నిరంతరం నీటిని విడుదల చేస్తున్నారు. ఆలయ ఆవరణలో భక్తులు నడిచేమార్గంలో కార్పెట్లను, కొన్ని చోట్ల కూల్‌పెయింట్‌లను వేశారు. క్యూలైన్ల గుండా వెళ్లేవారికోసం కొన్ని ప్రాంతాల్లో కూలర్లను ఉంచారు. దీంతో భక్తులు ఎక్కడా ఎండకు ఇబ్బందులు పడడం లేదు. ఆలయ అనివేటి మండపం బయట ఉన్న జంట వృక్షాల నీడలోనూ, అనివేటి మండపంలోను భక్తులు ఉపశమనం పొందుతున్నారు. క్యూలైన్లలో వెళ్లే యాత్రికులకు, ఆలయ పరిసరాల్లో సంచరించేవారికి మంచినీటిని నిరంతరం సిబ్బంది ద్వారా అందజేస్తున్నారు.అవసరానికి అనుగుణంగా భక్తులకు మరిన్ని సౌకర్యాలను కల్పిస్తామని ఆలయ ఈవో ఎన్వీ సత్యన్నారాయణమూర్తి తెలిపారు.

గోవిందనామాలతో హోరెత్తిన శ్రీవారి క్షేత్రం

గోవిందా...అంటూ గుండెల నిండా భక్తిని నింపుకుని వచ్చిన భక్తజనులతో చిన్నతిరుమల కళకళలాడింది.తెల్లవారు జాము నుంచే ఆలయానికి భక్తుల రాక ప్రారంభమైంది. దాదాపు 15 వేల మంది వరకూ భక్తులు ఆలయానికి వచ్చినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.వచ్చిన భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.



కాళ్లు కాలకుండా తివాచీల ఏర్పాటు



క్యూలైన్ల వద్ద కూలర్ల ఏర్పాటు



భక్తులకు మంచినీరు అందజేత

క్రైమ్ కార్నర్

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఏలూరు క్రైం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి శనివారం మృతి చెందాడు. కైకలూరుకు చెందిన పెద్దింటి అజయ్ (40)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఈనెల 11వ తేదీన పురుగుల మందు తాగాడు. తీవ్ర అస్వస్థతకు గురైన అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందా డు. కైకలూరు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. అనుమా నాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పదిహేనేళ్లుగా పరారీలో ఉన్న నిందితుడి అరెస్టు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : చీటింగ్ కేసులో అరెస్టు కాబడి కోర్టు నుంచి బెయిల్ పొంది ఆపై కోర్టు వాయిదాలకు హాజరుకాకుండా పరీరాలో ఉండడంతో కోర్టు నాన్ బెయిలబుల్ వారెంటు జారీ చేసింది. పోలీసులకు చిక్కకుండా పదిహేనేళ్ల నుంచి పరారీలో ఉన్న నిందితుడిని ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ పర్యవేక్షణలో ఉన్న ఐడీ పార్టీ పోలీసులు అరెస్టు చేశారు. 2010లో అప్పటి డీఐజీ మహేష్‌ఎం భగవత్ వద్దకు విజయవాడకు చెందిన జవ్వాది లక్ష్మీచందు మరో వ్యక్తి చిన్ననాయుడు (కడప) వచ్చి ఒక ఎస్‌ఐకి తణుకుకు పోస్టింగ్ ఇవ్వాలని తాము వైఎస్‌ఆర్ బంధువులమంటూ చెప్పుకొచ్చి ఒత్తిడి చేశారు. వారిపై అనుమానం కలిగి విచారించారు. ఈ ఘటనపై అప్పటి డీఐజీ ఆఫీస్ మేనేజర్ బండి మోహనరావు ఫిర్యాదు మేరకు ఏలూరు త్రీటౌన్ పోలీసులు వారిద్దరిపై చీటింగ్ కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. రిమాండ్‌లో ఉన్న వారిద్దరు బెయిల్‌పై బయటకు వచ్చారు. అప్పటినుంచి జవ్వాది లక్ష్మీచందు కోర్టు వాయిదాలకు హాజరు కాకపోవడంతో నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ అయింది. అప్పటినుంచి పోలీసులకు చిక్క కుండా పరారీలో ఉన్నాడు. జిల్లా ఎస్పీ కిశోర్ ఆదేశాల మేరకు నాన్‌బెయిలబుల్ వారెంట్ల ఐడీ పార్టీ పోలీసులైన త్రీటౌన్ ఎస్‌ఐ పి.అప్పారావు, హెడ్ కానిస్టేబుళ్ళు పి.కనకాంబరం, జి.రవి కుమార్ కలిసి లక్ష్మీచందును శనివారం అరెస్టు చేశారు.

శ్రీవారి క్షేత్ర ఆవరణలో మందుబాబు హల్‌చల్

» ఇద్దరు హోంగార్డులపై దుర్భాషల పర్వం » పోలీస్‌స్టేషన్‌కు తరలింపు

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): శ్రీవారి ఆలయ జంటగోపురాల వద్ద ఓ మందుబాబు శనివారం హల్‌చల్ చేశాడు. ద్వారకాతిరుమలకు చెందిన జి.అంజి అలియాస్ టింకు అనే యువకుడు ఫుల్‌గా మద్యం సేవించి కారులో కొండపైనున్న జంటగోపురాల వద్దకు వచ్చాడు. కారు పార్కింగ్ నిమిత్తం గేట్లు తెరవాలని అక్కడ విధుల్లో ఉన్న హోంగార్డు ప్రకాష్‌ను డిమాండ్ చేశాడు. ఇక్కడ పార్కింగ్ చేయకూడదని, నీవు తాగివచ్చావు గుడి ప్రాంగాణానికి రావడం పద్ధతి కాదని చెప్పినా వినకుండా ఘర్షణకు దిగి దుర్భాషల పర్వానికి తెరలేపాడు. కారును రోడ్డుకు అడ్డంగా పెట్టి ట్రాఫిక్‌కు అంతరాయం కల్గించాడు. దాదాపు అరగంట ట్రాఫిక్ నిలిచిపోవడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అక్కడే విధుల్లో ఉన్న మరో హోంగార్డు వెంకటేష్ జోక్యం చేసుకోవడంతో అతనిపై కూడా విరుచుకుపడ్డాడు. ఈక్రమంలో ఆ హోంగార్డు యూనిఫాం చిరిగిపోయింది. ఆలయ భద్రతా సిబ్బంది అప్రమత్తమై నచ్చచెప్పినా వినకపోవడంతో అతడిని, అతడి కారును ద్వారకాతిరుమల పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. పవిత్ర క్షేత్రంలో ఈవిధంగా మద్యం సేవించి రావడమే కాకుండా గార్డులపై దౌర్జన్యానికి దిగిన అతడిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

ప్రేమ పెళ్లికి ఒప్పుకోలేదని.. యువతి ఆత్మహత్య !

» ఏలూరు ఆసుపత్రి మార్చురీ గేట్ వద్ద యువకుడి మోసం వల్లేనంటూ తల్లిదండ్రుల ఆందోళన



నాగరాజు నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న సీఐ అశోక్‌కుమార్ (ఇన్‌సెట్‌లో) మృతదేహం వద్ద రోధిస్తున్న తల్లి

ఏలూరు క్రైం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : ప్రేమ వ్యవహారంలో ఓ ప్రైవేటు నర్సు జీవితంపై విరక్తి చెంది పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు, మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలివి.. ముసునూరు మండలం అక్కిరెడ్డిగూడెంనకు చెందిన పంతంగి నాగరాజు రమాదేవి దంపతులు వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారు. వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె ఉమాశిరీష (23) జీఎన్‌ఎం చదివి తొలుత విజయవాడలోని ప్రైవేటు ఆసుపత్రిలో పనిచేసి ప్రస్తుతం ఏలూరు రామచంద్రరావుపేటలో ఉన్న ఒక ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తుంది. కుమారుడు సాయిమోహన్ ఏలూరు సీఆర్‌ఆర్ కాలేజీలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. ఉమాశిరీష విజయవాడలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా పనిచేసే సమయంలో విసన్నపేట మండలం ముత్రాసుపాలెంకు చెందిన ప్రవీణ్ అనే యువకుడు అదే హాస్పటల్‌లో పనిచేస్తూ పరిచయం అయ్యాడు. వీరిద్దరూ ప్రేమలో పడ్డారు. వీరి ప్రేమ వ్యవహారం శిరీష తల్లిదండ్రులకు తెలియడంతో ఆమెను అక్కడ నుంచి మాన్పించి ఏలూరులో చేర్పించారు. ఆ యువకుడిని హెచ్చరించారు. తిరిగి మళ్లీ వారు ప్రేమ కార్యకలాపాలు కొనసాగడంతో అతడినే పెళ్లి చేసుకుంటానని మృతురాలు తల్లిదం డ్రులకు చెప్పింది. వారు అంగీకరించకపోవడంతో ప్రేమ జంట తొలుత ఆత్మహత్య చేసుకోవాలని భావించినట్లు సమాచారం. ప్రస్తుతం ఇంటికి వెళ్లిన శిరీష తన ప్రేమ వ్యవహారాన్ని మరోమారు తన తల్లిదండ్రులకు చెప్పడంతో వారు నిరాకరించారు. మానసికంగా, తీవ్రంగా కుమిలిపోయిన శిరీష ఈనెల 11వ తేదీన తన ఇంటివద్దే పురుగుల మందు తాగేసింది. తల్లిదండ్రులు ఆమెను తొలుత ధర్మాజీగూడెం ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లగా అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం ఏలూరు తీసుకువచ్చారు. చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం మృతి చెందింది.

పురుగుల మందు డబ్బాతో తల్లిదండ్రుల నిరసన

మార్చురీ వద్ద మృతదేహాన్ని భద్రపర్చిన అనంతరం ఆమె తల్లిదండ్రులు నాగరాజు, రమాదేవిలు మార్చురీ గేటు వద్ద మండుటెండలో కూర్చుని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. న్యాయం చేయకపోతే పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకుంటామని చేతిలో పురుగుల మందు డబ్బాపెట్టుకుని అక్కడే నిరసన తెలియజేశారు. సమాచారం అందుకున్న టూటౌన్ సీఐ జి. అశోక్‌కుమార్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని వారి నుంచి వివరాలు అడిగి తెలుసుకుని ముసునూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ముసునూరు పోలీసులు సాయంత్రానికి ఏలూరు చేరుకుని మృతురాలి కుటుంబ సభ్యుల నుంచి ఫిర్యాదు తీసుకున్నారు. ఇదిలా ఉండగా తన కుమార్తెను మోసగించడం విసన్నపేట మండలం ముత్రాసుపాలెంకు చెందిన ప్రవీణ్ మోసగించడం వల్లే ఆత్మహత్య చేసుకుందని తన బిడ్డ మరణానికి అతనే కారకుడు అంటూ అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శిరీష మృత దేహానికి ఆదివారం పోస్టుమార్టం నిర్వహించనున్నారు.

అక్రమ బెల్ట్ షాపులపై కేసులు

» పి.రాజవరంలో 8 మందిపై నమోదు

» మద్యానికి బానిసైతే కౌన్సెలింగ్ ఇప్పిస్తాం : ఎక్సైజ్ సీఐ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

జీలుగుమిల్లి, ఏప్రిల్: 12 (ఆంధ్రజ్యోతి) : పి.రాజవరంలో మద్యానికి బానిసై వ్యక్తి మృతి చెందిన విషయమై ఆంధ్రజ్యోతిలో శనివారం వచ్చిన కథనానికి జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు స్పందించారు. ఎస్‌ఐ ఎస్ఎన్ఎస్. సుబ్రహ్మణ్యంతో కలిసి పి.రాజవరంలో కాకాని వంశీ చనిపోయిన విషయమై ఆరా తీశారు. అతడికి మద్యం అలవాటు ఉండడం వాస్తవమేనని అతడు కొంతకాలంగా గుండె, మూత్ర పిండాల వ్యాధితో అనారోగ్యంతో ఉంటున్నట్టు చెప్పారు. ఆరోగ్య పరిస్థితి విషమించిందని 11వ తేదీన జంగారెడ్డిగూడెం ఆస్పత్రిలో వైద్యం పొందుతూ మృతి చెందాడన్నారు. యువత మద్యం మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. గ్రామంలో బెల్టు షాపులు నిర్వహిస్తున్నారనే సమాచారంతో 8 మందిపై కేసులు నమోదు చేశారు.

మద్యం బాధితులను మారుస్తాం : సీఐ

మద్యానికి బానిసైన వారి విషయంలో మార్పు వచ్చేలా తమ దృష్టికి తీసుకువస్తే మద్యం, మత్తు విమోచన కేంద్రం, ఏలూరులో ప్రభుత్వ ఆస్పత్రిలో లేదా దేవి ఎడ్యుకేషనల్ సొసైటీ ద్వారా కౌన్సెలింగ్ ఇప్పిస్తామని ఎక్సైజ్ సీఐ తెలిపారు.

కామయ్యపాలెంలో బెల్లం ఊట ధ్వంసం..

ప్రొహిబిషన్ ఎక్సైజ్‌శాఖ జిల్లా అధికారుల ఆదేశాల మేరకు కామయ్యపాలెం సమీప పొలాల్లో శనివారం ఎక్సైజ్ అధికారులు సారా తయారీ కేంద్రంపై దాడి చేశారు. సారా తయారీకి ఉపయోగించే 200 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశారు. ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని వ్యక్తిపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్లు సీఐ శ్రీనుబాబు, ఎస్‌ఐ సుబ్రమణ్యం తెలిపారు.

పోక్సో కేసులో ఒకరికి జీవిత ఖైదు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : మతిస్థిమితం లేని 16 ఏళ్ల బాలికను అపహరించి అత్యాచారానికి పాల్పడినట్లు ఓ వ్యక్తిపై నేరం రుజువు కావడంతో అతడికి జీవితఖైదు, రూ.ఐదు వేలు జరిమానా విధిస్తూ ఏలూరులోని పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి ఎస్. ఉమాసునంద తీర్పు చెప్పారు. చాగల్లు మండలంలో ఒక గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని బాలికను రాజమహేంద్రవరం, నామవరానికి చెందిన నందా శ్రీను(35) ఆ బాలికను 2017 జులైలో అపహరించి, అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై బాలిక తల్లి చాగల్లు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అప్పటి ఎస్‌ఐ ఎం.జయబాబు కేసు నమోదు చేయగా అప్పటి కొవ్వూరు డీఎస్పీ ఎస్.వెంకటేశ్వరరావు కేసు దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్టు చేశారు. ఈ కేసు ఏలూరు పోక్సో కోర్టులో విచారణ సాగింది. నిందితుడిపై నేరం రుజువు కావడంతో జీవితఖైదు విధించారు. బాధితురాలికి రూ.రెండు లక్షలు పరిహారం చెల్లించాలని తీర్పు చెప్పారు.



శాంతినగర్ 8వ రోడ్డు అపార్ట్‌మెంట్.. కాలి బూడిదైన సామగ్రి

అపార్ట్‌మెంటులో అగ్నిప్రమాదం

» టీవీ ప్లగ్ వద్ద షార్ట్ సర్క్యూట్ » రూ.15 లక్షల ఆస్తినష్టం

» ఐదుగురిని కాపాడిన అగ్నిమాపక సిబ్బంది

ఏలూరు క్రైం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : ఇంట్లోని టీవీ ప్లగ్ వద్ద షార్టు సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.15 లక్షల విలువైన వస్తువులు దగ్ధమయ్యాయి. ఏలూరు శాంతినగర్, 7వ రోడ్డులో ఉన్న హిమా ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్‌లోని 4వ అంతస్తులో ఎస్‌కేఎస్ రెసిడెన్షియల్ ఇంగ్లీషు మీడియం స్కూల్ అధినేత మారగాని నాగశ్రీకాంత్ కుటుంబంతో నివాసం ఉంటున్నారు. శనివారం ఉదయం తన కుటుంబంతో 9.30 గంటలకు ఊరు వెళ్లినప్పుడు ఇంటికి తాళాలు వేసి బయలుదేరిన 15 నిమిషాల్లోనే వారి ఇంట్లో నుంచి పొగలు వస్తున్నాయని అపార్టుమెంటు వాసులు ఫోన్ చేయడంతో తిరిగి వచ్చారు. మరోవైపు అగ్ని ప్రమాదసమాచారాన్ని ఏలూరు ఫైర్‌స్టేషన్‌కు తెలపడంతో జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి సీహెచ్ రత్నబాబు, జిల్లా అదనపు అగ్నిమాపక శాఖ అధికారి వి.రామకృష్ణ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే నలుగురు అపార్టుమెంటు పైభాగంగా పొగలో చిక్కుబడిపోయారు. ఆ ఫ్లాట్ వద్ద మరో వృద్ధురాలు పొగలో చిక్కుబడింది. వారందరిని అగ్ని మాపక సిబ్బంది సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. మంటలను అదుపు చేసి ఆర్పారు. అప్పటికే ఆ ఇంట్లో ఖరీదైన ఫర్నీచర్, విలువైన వస్తువులు, రెండు ఫ్రిజ్‌లు దగ్ధమయ్యాయి. వంటగది, హాలులోని వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి. బెడ్‌రూములోకి మంటలు ప్రవేశించకుండా అదుపు చేశారు. టీవీ ప్లగ్ వద్ద విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరిగి మంటలు వ్యాపించినట్లుగా అగ్నిమాపకశాఖ అధికారులు గుర్తించారు.



గోనె సంచుల గోడౌన్‌లో ఎగసిపడుతున్న మంటలు

జువ్వలపాలెంలో షార్ట్ సర్క్యూట్..

» గోడౌన్‌లో అగ్నిప్రమాదం.. రూ.8 లక్షల నష్టం

కాళ్ల : జువ్వలపాలెంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో శనివారం తెల్లవారుజామున గోనెసంచుల గోడౌన్‌లో అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో సుమారు రూ. 8 లక్షల విలువైన సంచులు దగ్ధమైనట్లు ఆకివీడు ఫైర్ ఆఫీసర్ వై.నాగేశ్వరరావు తెలిపారు. సమాచారం తెలుసుకున్న సిబ్బంది హుటాహుటిన తరలివెళ్ళి మంటలను అదుపు చేయడంతో సుమారు రూ. 2 లక్షల విలువైన సామగ్రి, సంచులు అగ్నికి ఆహుతి కాకుండా కాపాడినట్లు తెలిపారు.

పట్టిసీమ సుదర్శన కల్యాణ వేంకటేశ్వరస్వామికి పూజలు

పోలవరం, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి) :పట్టిసీమ సుదర్శన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు తొమ్మిది శనివారాల వ్రతాల్లో భాగంగా స్వామికి పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేదపండితులు శంకరమంచి వెంకట్రామశర్మ మాట్లాడుతూ ఆలయంలో వాడపల్లి వెంకన్న తరహాలో ఏడు శనివారాల వ్రతాలు, తొమ్మిది శనివారాల వ్రతాలను భక్తులు ఆచరిస్తున్నారని వ్రతాల ముగింపు సందర్భంగా విష్ణు సహస్రనామార్చన, ఏకాదశ రుద్రాభిషేకం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

16న చింతలపూడిలో జాబ్‌మేళా

చింతలపూడి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నిరుద్యోగ యువత కోసం ఉద్యోగ మేళాను స్థానిక చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 16న భారీ స్థాయిలో నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ తెలిపారు. ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో 15కుపైగా ప్రముఖ జాతీయ బహుళ జాతీయ కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. పదో తరగతి నుంచి పీజీ వరకు అర్హులైన అభ్యర్థులు పాల్గొనవచ్చని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే చంటి


ప్రజాసమస్యలు వింటున్న చంటి

ఏలూరుటూటౌన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే చంటి అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని ప్రజలు సహకరించాలన్నారు. నగరంలో రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి తగు చర్యలు తీసుకుంటామన్నారు. నియోజకవర్గంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు.

గోనెసంచుల నాణ్యతలో ఎటువంటి రాజీ లేదు : జేసీ

ఏలూరు సిటీ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలులో భాగంగా రైతులు ఉపయోగించే గోనె సంచులు నాణ్యతగా ఉండాలని, ఈ విషయంలో ఎటువంటి రాజీ లేదని జేసీ ధాత్రిరెడ్డి స్పష్టం చేశారు. శనివారం గౌతమి సమావేశ మందిరంలో రబీ ధాన్యం కొనుగోలుపై రైస్ మిల్లర్లు , వ్యవసాయ , సివిల్ సప్లయిస్, రవాణా, సహకార, మార్కెటింగ్ తదితర శాఖల అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో రబీ పంటకాలానికి సంబంధించి ధాన్యం సేకరణ ఈనెల 2వతేదీ నుంచి ప్రారంభం అయిందన్నారు. రబీ ధాన్యం సేకరణకు సుమారు 55 లక్షల గోనె సంచులు అవసరం ఉంటుందని, ఈ మేరకు ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచటానికి చర్యలు తీసుకున్నా మన్నారు. ధాన్యం రవాణాకు సంబంధించి వాహనాల రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలని రవాణాశాఖాధికారులను ఆదేశించారు. జిల్లాలో 22 మండలాల్లో సాగు చేసిన ధాన్యం సేకరణ కోసం ఉన్న ఆర్ఎస్‌కేలు 241 ఉండగా ఆర్ఎస్‌కే కేంద్రాలను తటస్థీకరణ చేసిన అనంతరం 118 వరకు ఏర్పాటు చేశామన్నారు. ఈ 118 ఆర్ఎస్‌కేలకు అనుసంధానం చేసిన 62 ప్రొక్యూర్‌మెంట్ సపోర్టింగ్ ఏజెన్సీలు రబీ సీజన్‌కు సంబంధించి ధాన్యం కనీస మద్దతు ధరకు ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నట్టు తెలిపారు. పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శివరామమూర్తి, డీఎస్‌వో ప్రతాప్‌రెడ్డి , జిల్లా వ్యవసాయశాఖాధికారి హబీబ్‌బాషా, ఇతర అధికారులు, రైస్‌మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.


అచ్చాయమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ పుట్టా

జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీకి ప్రముఖుల పరామర్శ

పెదపాడు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమ జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీని ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌యాదవ్, పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు శనివారం సత్యవోలులోని ఆమె ఇంటి వద్ద కలిసి పరామర్శించారు. జడ్పీ చైర్‌పర్సన్ అత్త అచ్చాయమ్మ ఇటీవల మృతి చెందిన సంగతి విధితమే. అచ్చాయమ్మ చిత్రపటం వద్ద వారు నివాళులర్పించారు. అచ్చాయమ్మ కుమారుడు బీసీ నాయకులు ఘంటా ప్రసాదరావు, ఘంటా ఫణీంద్రకుమార్‌లకు సానుభూతిని తెలిపారు.

16న లింగపాలెంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక

లింగపాలెం, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మండలంలో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారానికి ఈనెల 16న మండల పరిషత్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో కలసి ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తామని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ తెలిపారు. అన్నారు. శనివారం లింగపాలెంలో స్థానిక కూటమి నాయకులతో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అధికారులకు అందించాలన్నారు.


కుక్కునూరు ప్రధాన రహదారిపై ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

వక్ఫ్ సవరణ చట్టం రద్దు చేయాలి

కుక్కునూరు/చింతలపూడి/ఏలూరు కార్పొరేషన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టం రద్దు చేసి రాజ్యాంగం ఇచ్చిన స్వేచ్ఛా సమా నత్వం కాపాడాలని సీపీఐ మండల కార్యదర్శి ఎం.వెంకటాచారి డిమాండ్ చేశారు. శనివారం సీపీఐ ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనలో ఉద్యోగులు మద్దతు పలికారు. కుక్కునూరు ప్రధాన రహదారిపై ఆందోళన చేపట్టారు. సీపీఐ నాయకులు కొన్నే లక్ష్మయ్య, కె.బాబూరావు, నాగరాజు, ఎస్‌కే. చాంద్‌బాష, ఎఫ్‌డీ ఉస్మాన్, ఖదర్‌బాబా, ఖరీముల్లా తదితరులు పాల్గొన్నారు. ఏలూరు సీపీఐ భవనంలో విశ్రాంత జడ్జి ఆడబాల లక్ష్మి అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు మాట్లాడారు. వక్ఫ్‌బోర్డు చట్ట సవరణ రాజ్యాంగ విరుద్ధమన్నారు.

చింతలపూడిలో..

వక్ఫ్‌బోర్డు సవరణ 2025 అమలును నిలిపివేయాలని సీపీఐ మండల కార్యదర్శి టి.బాబు డిమాండ్ చేశారు. స్థానిక ఏలూరు రోడ్డులో సంబంధిత ప్రతులను దహనం చేశారు. ఆయన మాట్లాడుతూ 2014లో అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ఆనాటి నుంచి ఈనాటి వరకు ముస్లిం మైనార్టీ హక్కులను కాలరాస్తూ, దాడులు చేస్తోందని ఆరోపించారు. సీపీఐ నాయకులు కంచర్ల గురవయ్య, డి.కృష్ణ, ఎస్.కె.కాలేషా, మోర్త లక్ష్మణరావు పాల్గొన్నారు.

ప్రత్తికోళ్లలంకలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు

ఏలూరురూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : ప్రత్తికోళ్లలంకలో వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఇటీవల ఆ గ్రామంలో విషజ్వరాలు ప్రబలాయి. వైద్య సిబ్బంది ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆదేశాల మేరకు ఎంపీడీవో వెన్నా శ్రీలత సూచనల మేరకు గ్రామంలో ఇన్‌చార్జి కార్యదర్శి సుమలత నేతృత్వంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. దోమల నివారణకు ఫాగింగ్, ఆయిల్‌బాల్స్, తాగునీటి ట్యాంకు పరిశుభ్రం చేయడం, క్రిమికీటకాల నిర్మూలనకు ఎబెట్ ఫాగింగ్ విస్తృతంగా నిర్వహించారు.

గోవులపై టీటీడీ మాజీ చైర్మన్ ఆరోపణలు అబద్ధం

ఏలూరురూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : టీటీడీ ఎస్వీ గోశాలలో వందకుపైగా గోవులు మృతి చెందా యని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి చేసిన ఆరోపణలు అబద్ధమని రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య అడ్వైజరీ కమిటీ చైర్మన్ సత్యవాడ దుర్గాప్రసాద్ అన్నారు. శనివారం విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడారు. గోవుల మృతిపై రాజకీయాలు చేయడం తగదన్నారు. ప్రతీ గోశాలలోను ఇటువంటివి సాధారణంగా అనారోగ్యంతో మృతి చెందు తుంటాయని ఇది సర్వ సాధారణమన్నారు. వందకుపైగా చనిపోయాయని ఆరోపణలు చేయడం మంచిదికాదన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు.. ఇద్దరికి గాయాలు

ఉంగుటూరు,ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి) : రాంగ్ రూట్‌లో వస్తున్న మోటారు సైక్లిస్టును కారు ఢీకొట్టిన ఘటన కైకరం హైవే వద్ద జరిగింది. శనివారం ఉదయం రాంగ్ రూట్‌లో వస్తున్న మోటారు సైక్లిస్టును ఏలూరు నుంచి తాడేపల్లిగూడెం వైపు వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎ.రమేష్ కాలు విరిగింది. పి.సందీప్ చేయికి తీవ్ర గాయమైంది. ప్రమాద సమయంలో హెల్మెట్ లేకపోవడంతో తీవ్రంగా గాయపడ్డారు. వీరిని హైవే అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ కాలేజీ విద్యార్థుల ప్రతిభ


ఎం.శశిప్రియ డి.ఇందుశ్రీ
పెదపాడు
ఎం.నాగసత్యప్రియ సీహెచ్.వెంకటదుర్గ
పోలవరం


ఎం.కీర్తిశ్రీ
పోలవరం
ఎం.హర్షిత డి.ప్రశాంతి హెచ్.విజయరాజు
ఉంగుటూరు

పెదపాడు, ఏప్రిల్ 12 : ఇంటర్మీడియెట్ పరీక్షల ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదివే విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. పెదపాడు జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షా ఫలితాల్లో జిల్లాస్థాయిలో రెండు ద్వితీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. పెదపాడు జూనియర్ కళాశాలకు చెందిన ఎం. శశిప్రియ, డి.హిందుశ్రీ ఎంపీసీ గ్రూపులో ఇద్దరు 972 మార్కులు చొప్పున సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. కె.రవితేజ 958 మార్కులు, కె.కుసుమదుర్గ 948 మార్కులు సాధించారు. ఎంపీసీ గ్రూపులో మొత్తం 15 మంది విద్యార్థులు రాయగా నూరుశాతం ఉత్తీర్ణత లభిం చింది. ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో టి.ముత్తయ్య 470 మార్కులు, ఎం.చరణ్‌తేజ 428 మార్కులు సాధించారు. వీరిని కళాశాల అధ్యాపక సిబ్బంది అభినందించారు.

పెదవేగి గురుకులంలో..

దెందులూరు:డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులం (బాలుర) పెదవేగిలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ మాడా వెంకటేశ్వరావు తెలిపారు, కె. తులసిరామ్ ఎంపీసీలో 952 మార్కులు సాధించినట్లు తెలిపారు,

నారాయణపురం జూనియర్ కాలేజీలో..

ఉంగుటూరు : నారాయణపురం మహాత్మా గాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభను చూపారని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బి.వి.శ్రీనివాస్ తెలిపారు. ఇంటర్ సెకండర్ ఇయర్ బైపీసీలో మిరియాల హర్షిత 948/1000, దొడ్డిగర్ల ప్రశాంతి 946/1000, హనుమంతు విజయరాజు ఎంపీసీలో 940/1000 మార్కులు సాధించారన్నారు. ప్రథమ సంవత్సరం ఫలితాలలో హనుమంతు దుర్గావెంకట లక్ష్మీ శ్రావ్య బైపీసీలో 412/440, దండి జ్యోతి సీఈసీలో 454/500, ఎంపీసీలో మానూరి భాను చరణ్ 424/470 సాధించారన్నారు.

శ్రీ వేంకటేశ్వర జూనియర్ కాలేజీలో..

కామవరపుకోట : స్థానిక శ్రీవేంకటేశ్వర జూనియర్ కళాశాలలో 57 మంది విద్యార్థుల్లో 14 మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరం ఇంటర్ పరీక్షలకు 23 మంది హాజరుకాగా 17 మంది ఉత్తీర్ణులై 75 శాతం ఉత్తీర్ణత శాతం నమోదైంది.

కుక్కునూరులో 33శాతం ఉత్తీర్ణత

కుక్కునూరు : కుక్కునూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో 33 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 81మంది విద్యార్థులకు 27మంది ఉత్తీర్ణులు కాగా 54 మంది ఫెయిల్ అయ్యారు.

ఎంపీహెచ్‌డబ్ల్యూలో ప్రభుత్వ కాలేజీ విద్యార్థిని జిల్లా టాపర్


టి.కనకమహాలక్ష్మి

ఏలూరు అర్బన్:ఇంటర్మీడియట్ జనరల్, ఒకేషనల్ కోర్సుల ఫలితాల్లో ఏలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు టాపర్లుగా నిలిచారు. ద్వితీయ సంవత్సరం ఒకేషనల్ కోర్సుల ఫలితాల్లో కళాశాల విద్యార్థిని టి.కనకమహాలక్ష్మి ఎంపీహెచ్‌డబ్ల్యు (ఫిమేల్) గ్రూపులో 967/1000 మార్కులు సాధించి జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల్లో టాపర్‌గా నిలిచింది. ఇదే గ్రూపులో ఇదే కళాశాలనుంచి టి. వెంకటసత్యవతి 940మార్కులతో ద్వితీయస్థానంలో నిలిచింది. జనరల్ విభాగంలో పి.ఎస్.భానుజ 962 మార్కులతో బైపీసీ గ్రూపులో ఐదో టాపర్‌గా నిలవగా, ప్రథమ సంవత్సరం ఒకేషనల్ విభాగంలో జి.సుమశ్రీ ఎంపీహెచ్‌డబ్ల్యు(ఫిమేల్)గ్రూపులో 489 మార్కులు, బి.భానుప్రకాశ్ ఎంఅండ్‌ఏటీ గ్రూపులో 488 మార్కులతో టాపర్లుగా నిలిచారు. వీరిని కళాశాల ప్రిన్సిపాల్ రాజ్‌కృష్ణ, అధ్యాపకులు అభినందించారు.

వేలేరుపాడులో 94శాతం ఉత్తీర్ణత

వేలేరుపాడు : వేలేరుపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల 94శాతం ఉత్తీర్ణత సాధించారు. 38 మంది పరీక్షలకు హాజరుకాగా 36మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. బైపీసీ గ్రూప్‌లో 22మందికి గానూ 22మంది ఉత్తీర్ణతసాధించి 100శాతం ఫలితాలు రాగా సీఈసీ గ్రూపులో 16 మందికి 14మంది ఉత్తీర్ణత సాధించటంతో 94శాతం నమోదైంది. ద్వితియ సంవత్సరం ఇంటర్‌లో బైపీసీ విద్యార్థిని కంపల శైలజ వెయ్యి మార్కులకు గానూ 937మార్కులు సాధించి కళాశాలలో ప్రథమ స్థానం పొందింది. బైపీసీలో ప్రొద్దుటూరి కిరణ్మయి 926మార్కులు, కొనగంటి ఇలియాన 917మార్కులు సాధించి ద్వితియ, తృతీయ స్థానాలు సాధించారు. మొదటిసంవ త్సరం ఇంటర్‌లో 48మందికి గానూ 38మంది ఉత్తీర్ణత సాధించగా 79శాతం నమోదైంది.

ద్వారకాతిరుమల గురుకులంలో..

ద్వారకాతిరుమల :ద్వారకాతిరుమలలోని అంబేద్కర్ గురుకులం విద్యార్థినులు జూనియర్ ఇంటర్‌లో 97.5 శాతం, సీనియర్ ఇంటర్‌లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ బెజవాడ రాణి తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో ఒ.ప్రతిభ 449/470, బైపీసీలో పి.జయవీర కౌసిక 429/440, సీనియర్ ఇంటర్ బైపీసీలో ఎన్.దుర్గాభవాని 981/ 1000, ఎంపీసీలో డి. భార్గవి 954/1000, జూనియర్ ఇంటర్‌లో 400కుపైగా 15మంది, సీనియర్ ఇంటర్‌లో 900కు పైబడి మార్కులు 36 మంది సాధించారన్నారు.

పోలవరంలో బాలికలదే హవా

పోలవరం : పోలవరం మండలంలో ఈ ఏడాది కూడా బాలికలదే పైచేయిగా నిలిచింది.టింటర్ ప్రథమ సంవత్సరంలో 55.5 శాతం, ద్వితీయ సంవత్సరం 84.2 శాతం ఉత్తీర్ణత సాధించారని పోలవరం ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ కె.నజిని తెలిపారు. బైపీసీ ప్రథమ సంవత్సరం ఎంపీసీ గ్రూపులో 437/470 మార్కులతో మడకం కీర్తి ,ద్వితీయ సంవత్సరం బైపీసీలో 839/1000 మార్కు లతో సీహెచ్ వెంకటదుర్గ కాలేజీ టాపర్లుగా నిలిచినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. గూటాల హైస్కూలు ప్లస్‌లో ఎంపీసీ గ్రూపులో 8 మందికి 8 మంది ఉత్తీర్ణులయ్యారని ప్రిన్సిపాల్ కేవీ రాఘవన్ తెలిపారు. వారిలో మారుముఖం నాగసత్యప్రియ 911/1000 మార్కులతో కాలేజీ టాపర్‌గా నిలిచింది.

జంగారెడ్డిగూడెంలో..

జంగారెడ్డిగూడెం : స్థానిక ఎస్‌డీఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని ప్రిన్సిపాల్ బి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఇంటర్ సెకండియర్ బైపీసీ విభాగంలో రెల్లి ఇందుశ్రీ 973 మార్కులు సాధించి కళాశాల ప్రథమ స్థానం, పూనెం దుర్గాభవానీ 936 మార్కులు సాధించి ద్వితీయ స్థానం, వరక హేమశ్రీ 933 మార్కులు సాధించి తృతీయ స్థానం సాధించినట్లు తెలిపారు. ప్రథమ సంవత్సర ఫలితాల్లో బైపీసీ విభాగంలో కుమ్మరి మేఘన 409 మార్కులు సాధించి కళాశాల ప్రథమ స్థానం, షేక్ ఇమాముస్సీసా, తగరం విజయకుమార్ 397 మార్కులతో ద్వితీయ స్థానం, ప్రథమ సంవత్సర హెచ్‌ఈసీ విభాగంలో కలసాని రమ్యశ్రీ 439 మార్కులతో మూడో స్థానంలో నిలిచారన్నారు.

అక్కా చెల్లెళ్ల ప్రతిభ


గెడ్డం తులసి.. పూజ

జీలుగుమిల్లి : ఇంటర్ ఫలితాల్లో జీలుగుమిల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే గెడ్డం పండు కుమార్తెలు తులసి, పూజ ఇంటర్ ఫలితాల్లో కళాశాల్లో ప్రథమ స్థానం సాధించారు. హెచ్ఈసీ గ్రూపులో చదివే వీరు సెకండ్ ఇయర్ తులసి 1000/825 మార్కులు, ఫస్ట్ ఇయర్ పూజ 500/449 మార్కులతో ఉత్తీర్ణత సాధించారు. గ్రామస్థులు, అధ్యాపకులు వీరిని అభినందించారు. ఇంటర్ కళాశాల విద్యార్థులు 73% ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ బొరగం సతీష్‌కుమార్ తెలిపారు.

బూసరాజు గురుకులంలో 94.5 శాతం

బుట్టాయగూడెం : బూసరాజుపల్లి గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలకు చెందిన విద్యార్థినులు ఇంటర్ సెకండియర్‌లో 94.5 శాతంతో ఉత్తీర్ణత సాధించినట్లు ఇన్‌చార్జి డీడీ శ్రీవిద్య తెలిపారు. బైపీసీలో చదువుచున్న ఎన్.సంధ్య 979 మార్కులు, ఎంపీసీలో ఎ.నాగేంద్రకుమార్‌రెడ్డి 934 మార్కులను సాధించారని తెలిపారు. కెఆర్ పురం గురుకులం విద్యార్థులు 74.2 శాతం, జీలుగుమిల్లి మండలం బర్రింకలపాడు గురుకులం విద్యార్థులు 62.9 శాతంతో ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. మూడు గురుకులాలకు చెందిన విద్యార్థులు 287 మంది పరీక్షలు రాయగా 228 మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. బుట్టాయగూడెం ప్రభుత్వ జూనియర్ కాలేజిలో సెకండియర్ ఇంటర్ విదార్థులు 96కు గాను 69 మంది పాసై 72 శాతంతో ఉత్తీర్ణత సాధించరని ప్రిన్సిపాల్ సంజీవిని కుసుమ తెలిపారు. ఒకేషనల్ కోర్సులో 73కు 69 మంది పాసై 81 శాతంతో ఉత్తీర్ణత సాధించారు.

సామాజిక సేవలోనే సంతృప్తి

ఏలూరురూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : సామాజిక సేవే లక్ష్యంగా ఉచిత వైద్య సేవలు అందిస్తున్నామని, సేవలోనే తమకు సంతృప్తి అని ప్రముఖ ఆర్థో వైద్య నిపుణులు శ్రీకృష్ణ అన్నారు. రామచంద్రరావుపేటలోని శ్రీకృష్ణ ఆర్థోపెడిక్ ఆసుపత్రిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గత 29 నెలలుగా ప్రతీనెలా రెండో శనివారం ఉచిత వైద్య సేవలతోపాటు మందులు, రక్త పరీక్షలు, ఎక్స్‌రే, ఎముకల సాంద్రత పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. తమ తండ్రి స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా 200 మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందచేశారు.

అమరుల ఆశయ సాధనకు కృషి చేయాలి

బుట్టాయగూడెం, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): అమరుల ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. శనివారం బుట్టాయగూడెం ఆదివాసీ విజ్ఞాన కేంద్రంలో మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. కుంజా బుజ్జి, మాకినేని బసవ పున్నయ్యలు పేదలు, శ్రామికుల కోసం, నమ్మిన సిద్ధాంతాల కోసం చివరి వరకు పనిచేశారని తెలిపారు. 1/70 చట్టం, అటవీ హక్కుల చట్టం, పోలవరం నిర్వాసితుల సమస్యలు, జీవో నెం.3 తదితర వాటికోసం పోరాటాలు చేశారన్నారు. కార్మికుల పక్షాన ఉద్యమాలు నిర్వహించారని కొనియాడారు. నాయకులు తెల్లం దుర్గారావు, మానుకొండ జీవరత్నం, కారం భాస్కర్, పోలోజు నాగేశ్వరావు, పూనెం శేఖర్, చంద్రు బుల్లెమ్మ పాల్గొన్నారు.

'మూతపడిన బాలికల వసతి గృహాన్ని తెరవాలి'

బుట్టాయగూడెం, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మండ ల కేంద్రంలో మూతపడిన సాంఘీక సంక్షేమ బాలికల వసతిగృహాన్ని తిరిగి తెరిపించాలని కోరు తూ శనివారం అంబేద్కర్‌పేటలోని డాక్టర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట కేవీపీఎస్ ఆధ్వర్యంలో దళితులు నిరసన తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ మాట్లాడుతూ వసతిగృహం మూత పడడంతో మండలంలోని బుట్టాయగూడెం, రెడ్డి గణపవరం, దొరమామిడి, ముప్పినవారిగూడెం, అచ్చియ్యపాలెం, కేఆర్‌పురం, కొమ్ముగూడెం మర్లగూ డెం తదితర గ్రామాలకు చెందిన ఎస్సీ బాలికలు పాఠశాలలకు రావడానికి అనేక ఇబ్బందులు పడుతు న్నట్లు తెలిపారు. పోలవరం నియోజకవర్గంలో ఎస్సీ బాలికల వసతిగృహం లేదని బుట్టాయగూడెంలో ఉన్న ఏకైక వసతిగృహాన్ని కారణాలు తెలపకుండా మూసివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎస్సీల చదువులకు ప్రాధాన్యతను ఇస్తూ మూసి వేసిన వసతిగృహాన్ని తెరిపించాలని కోరారు. ఇదే విషయంపై ఎమ్మెల్యే చిర్రి బాలరాజుకు వినతిపత్రం ఇచ్చామని విద్యాశాఖ మంత్రితో మాట్లాడి బాలికల వసతిగృహాన్ని తెరిపిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. నాయకులు ఎస్.కుటుంబరావు, ఏసుపా దం, టి.రాజు, ఎన్.శ్యామ్, ఎన్.రాజు తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో జేబుదొంగల హల్‌చల్

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): శ్రీవారి క్షేత్ర బస్టాండ్‌లో శనివారం జేబుదొంగలు హల్‌చల్ చేశారు. శని, ఆదివారాల్లో భక్తుల రద్దీకి అనుగుణంగా ఇక్కడకు వచ్చి అందినకాడికి దండుకుంటున్నారు. ఈ క్రమంలోనే ఆలయానికి వచ్చి తిరుగుప్రయాణంలో బస్సు ఎక్కుతున్న ఓ భక్తుని జేబులోని సెల్‌ఫోన్‌ను మాయం చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా గణపవరం మండలం ముప్పర్తిపాడుకు చెందిన గుడిమెట్ల వెంకటరెడ్డి తన కుటుంబసభ్యులతో కలిసి క్షేత్రానికి వచ్చాడు. దర్శనానంతరం ఇంటికి వెళ్లేందుకు నరసాపురం బస్సు ఎక్కాడు. కొద్దిదూరం వెళ్లి చూసుకునేసరికి ఫోన్ కన్పించలేదు. బస్సు దిగి తిరిగి ద్వారకాతిరుమల బస్టాండ్‌కు వచ్చాడు. ఇదే సమయంలో బస్సు ఎక్కుతున్న ఓ భక్తుని జేబు నుంచి సెల్‌ఫోన్‌ను గుర్తుతెలియని వ్యక్తి దొంగిలించాడని గమనించి అతడిని పట్టుకుని ద్వారకాతిరుమల పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.


సీఎం సహాయ నిధి చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు

'సీఎం సహాయ నిధి'ని సద్వినియోగం చేసుకోవాలి

ఉంగుటూరు, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి) : పేదలు అనారోగ్యంగా ఉంటూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారు సీఎం సహాయ నిధి వచ్చే వెసులుబాటును సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల అనారోగ్య బాధితులకు చెక్కులను శనివారం క్యాంపు కార్యాలయంలో అందించారు. 25 మంది లబ్ధిదారులకు గాను రూ.17లక్షల చెక్కులను అందించారు. ఎమ్మెల్యేతో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.

మత్తుకు బానిసలు కావద్దు : ఆవులయ్య


డ్రగ్ అడిక్షన్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న వ్యక్తి నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఆవులయ్య

ఏలూరు క్రైం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : మత్తుకు బానిసలు కావద్దని అనారోగ్యాలకు గురికా వద్దని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారి ఎ. ఆవులయ్య అన్నారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలోని డ్రగ్ అడిక్షన్ సెంటర్‌ను శనివారం ఆయన పరిశీలించారు. చికిత్స పొందుతున్న రోగుల వివరాలను, చికిత్సా ఫలితాలను వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రోగులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవోదయ 2.0లో భాగంగా ఇప్పటికే జిల్లాలో మత్తుకు పూర్తిగా బానిసలైన 50 మందిని గుర్తించామని వారిని డ్రగ్ అడిక్షన్ సెంటర్‌లో చేరుస్తామన్నారు. సారా ప్రభావిత గ్రామాల్లో మత్తుకు ఇంకా ఎంతమంది బానిసలయ్యారో తెలుసుకునే పనిలో ఉన్నామని అవసరమైన వారిని ఇక్కడ చేరుస్తామన్నారు. అంతేకాకుండా వాళ్ళు ఏవిధంగా చికిత్స పొందుతున్నారు. కోలుకుని ఇంటికి వెళ్లాక సక్రమంగా ఉంటున్నారా మళ్లీ మత్తు పదార్థాల జోలికి వెళుతున్నారా అనే దానిపై ఎక్సైజ్ శాఖ సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారనిన్నారు. గ్రామాల్లో చైతన్యం తీసుకువచ్చే విధంగా అవగాహనా సదస్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతరం ఎన్‌జీవో ఆర్గనైజేషన్ ద్వారా నిర్వహిస్తున్న దేవి ఎడ్యుకేషనల్ సొసైటీ డ్రగ్ అడిక్షన్ సెంటర్‌ను పరిశీలించారు. ఎక్సైజ్ శాఖ జిల్లా సహాయ అధికారి పాండురంగారావు, ఎక్సైజ్ సీఐ కృష్ణ ధనరాజు పాల్గొన్నారు.



రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన సోమశేఖర్‌ను అభినందిస్తున్న రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

సంఘ అభివృద్ధికి కృషి చేస్తా : సోమశేఖర్

ఏలూరురూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : సంఘ అభివృద్ధికి, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని నూతనంగా ఎంపికైన ఏపీఏఈడబ్ల్యూఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమశేఖర్ తెలిపారు. శనివారం ఏలూరులో ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చరల్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా వ్యవసాయ అధికారుల సంఘ రాష్ట్ర చైర్మన్ ఎం.వి. శేషారెడ్డి మాట్లాడుతూ ఏపీఏఈడబ్ల్యూఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొయ్యలగూడెం అగ్రికల్చరల్ అధికారి బోడపూడి సోమశేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు. ఈ సందర్భంగా సోమశేఖర్‌ను రాష్ట్రకార్యవర్గ సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పాపయ్యానాయుడు, రాష్ట్ర అధ్యక్షుడు బత్తిన రంగనాథ్‌బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.శివప్రసాద్, బి.సాయిశ్రీ, అల్లం హేమ, మహిళా కార్యదర్శి, పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు జి. నరేంద్ర, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నాటు సారా పట్టివేత : ఒకరి అరెస్టు

చింతలపూడి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని నాగిరెడ్డిగూడెం గ్రామంలో శనివారం నాటుసారా స్థావరాలపై అధికారులు దాడులు జరిపారు. భూక్యా గోపికి చెందిన 100 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. అదే గ్రామానికి చెందిన ఇస్లావత్ దివ్యకు సంబంధించిన 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి ఆ మహిళపై పరారీ కేసు నమోదు చేసినట్టు ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.అశోక్ తెలిపారు.

ఆక్వా సంక్షోభ సమయంలో రైతులకు అండగా నిలవాలి

నిడమర్రు ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఆక్వా రంగం తీవ్ర సంక్షోభంలో ఉందని ఈ సమయంలో ప్రభుత్వం, ఫీడ్, సీడ్ కంపెనీలు రైతులకు అండగా నిలబడాలని రాష్ట్ర ఆక్వా ఎగుమతిదారుల సంఘం అధ్యక్షుడు, ఎంపీ బీద మస్తానరావు అన్నారు. భువ్వనపల్లిలో జరిగిన ఆక్వా రైతుల అవగాహన సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. ఆక్వా ఫీడ్, సీడ్, మెడిసన్ కంపెనీలు తమ ఉత్పత్తుల రేట్లు తగ్గించి రైతులకు అండగా నిలబడాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే పుప్పాల శ్రీనివాసరావు, ఆక్వా రైతులు పొత్తూరి శ్రీనివాసరాజు, కలిగొట్ల యువరాజు, కోడే కాశీ, బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛను కాపాడాలి

ఉంగుటూరు, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి) : పత్రికా స్వేచ్ఛను కాపాడాలని ఉంగుటూరు ప్రెస్ క్లబ్ నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం ఉంగుటూరు తహసీల్దార్ కార్యాలయంలో డీటీ పూర్ణచంద్రప్రసాద్‌కు రాష్ట్రంలో ఇటీవల పాత్రికేయులపై జరుగుతున్న దాడులకు నిరసనగా ప్రెస్ క్లబ్ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యవర్గసభ్యుడు గుత్తికొండ శ్రీనివాసరావు, ఉంగుటూరు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ముప్పన భుజంగరావు, కార్యదర్శి వీవీ సత్యనారాయణ, గౌరవాధ్యక్షుడు పాండ్రాకుల పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

సురేశ్ మృతి తీరనిలోటు

ఏలూరుటూటౌన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికుడు యర్రంశెట్టి సురేశ్ మృతి తీరనిలోటని ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి బి. శ్రీనివాసరావు అన్నారు. ఏలూరులో సురేశ్ స్వగృహంలో భౌతిక కాయాన్ని సందర్శించి మునిసిపల్ ఉద్యోగులు, కార్మికులు నివాళులర్పించి, అతడి కుటుంబానికి అండగా నిలుస్తామన్నారు. నాగేంద్ర, దుర్గాప్రసాద్, దేవేంద్ర, జె.శివ, కిరణ్, వంశీ పాల్గొన్నారు.

కాలేజీకి బీరువా బహూకరణ

చింతలపూడి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌కు పీఆర్‌టీయూ నాయకులు అప్పిరెడ్డి రాము బీరువాను బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైస్కూల్‌కు అవసరమైన బీరువాను తమ తండ్రి దుర్గారావు జ్ఞాపకార్థం ఇచ్చామని తెలిపారు. పీఆర్‌టీయూ నాయకులు దయాకర్, కృష్ణంరాజు, కీమ్యా పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

టి.నరసాపురం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి):వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశామని సామాజిక కార్యకర్త గుండే పాంగురంగ తెలిపారు. బొర్రంపాలెంలోని ప్రధాన సెంటర్‌లో స్వచ్ఛసేవా చారిటబుల్ ట్రస్ట్ అధినేత పెండ్యాల అభిషేక్‌బాబు ఆర్థిక సహాయంతో శనివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. అభిషేక్‌బాబు యూత్ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి నూజివీడు
నూజివీడు, కైకలూరు
9 www.andhrajyothy.com ● ఆదివారం 13 ఏప్రిల్ 2025

కనుల పండువగా విశ్వేశ్వర స్వామి కల్యాణం

ముదినేపల్లి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): వడాలిలోని గంగా అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం స్వామివార్ల శాంతి కల్యాణం జరిగింది. ఏటా చైత్ర మాస పౌర్ణమి రోజున స్వామి కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. అర్చకుడు దొండబట్ల నాగేశ్వరశర్మ విశ్వేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహించగా, పెద్ద సంఖ్యలో భక్తులు తిలకించారు. ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు పర్యవేక్షణలో శాంతి కల్యాణం జరిగింది.

పంట కాల్వలో చెత్త తొలగింపు పనులు

కైకలూరు, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): వేసవిలో మంచినీటి ఎద్దడిని నివారించేందుకు త్వరలో కాల్వలకు నీరు విడుదల కానున్నందున పంట కాల్వల్లో చెత్త తొలగింపు పనులు నిర్వహిస్తున్నట్లు తామరకొల్లు సాగునీటి సంఘాల అధ్యక్షుడు గంగుల ఏసురాజు తెలిపారు. వింజరం నుంచి తామరకొల్లు వెళ్లే పంట కాల్వలో శనివారం చెత్తతొలగింపు పనులను ఉపాధి హామి పథకం కూలీలతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసురాజు మాట్లాడుతూ ఈ నెల 15 తర్వాత కాల్వలకు నీరు విడుదలవుతున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ వెల్లడించారని ఆయన ఆదేశాల మేరకు ఉపాధి హామి కూలీలతో పంట కాల్వలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. రానున్న వేసవిలో మంచినీటి ఇబ్బందులు లేకుండా తామరకొల్లుకు పూర్తిస్థాయిలో నీటి సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.



శాంతినగర్ 8వ రోడ్డు అపార్ట్‌మెంట్.. కాలి బూడిదైన సామగ్రి

అపార్టుమెంటులో అగ్నిప్రమాదం

- రూ.15 లక్షల ఆస్తినష్టం..
- పొగలో చిక్కుకున్న ఐదుగురిని కాపాడిన అగ్ని మాపక సిబ్బంది

ఏలూరు క్రైం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : ఇంట్లోని టీవీ ఫ్లగ్ వద్ద షార్టు సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.15 లక్షల విలువైన వస్తువులు దగ్ధమయ్యాయి. ఏలూరు శాంతినగర్, 7వ రోడ్డులో ఉన్న హిమా ఎన్‌క్లేవ్‌లో 4వ అంతస్తులో ఎస్‌కేఎస్ రెసిడెన్షియల్ ఇంగ్లీషు మీడియం స్కూల్ అధినేత మారగాని నాగ శ్రీకాంత్ కుటుంబంతో నివాసం ఉంటున్నారు. శనివారం ఉదయం తన కుటుంబంతో 9.30 గంటలకు ఊరు వెళ్లినప్పుడు ఇంటికి తాళాలు వేసి బయలుదేరిన 15 నిమిషాల్లోనే వారి ఇంట్లో నుంచి పొగలు వస్తున్నాయని అపార్టుమెంటు వాసులు ఫోన్ చేయడంతో తిరిగి వచ్చారు. మరోవైపు అగ్ని ప్రమాదసమాచారాన్ని ఏలూరు ఫైర్‌స్టేషన్‌కు తెలపడంతో జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి సీహెచ్ రత్నబాబు, జిల్లా అదనపు అగ్నిమాపక శాఖ అధికారి వి.రామకృష్ణ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే నలుగురు అపార్టుమెంటు పైభాగంగా పొగలో చిక్కుబడిపోయారు.

ఆ ఫ్లాట్ వద్ద మరో వృద్ధురాలు పొగలో చిక్కుబడింది. వారందరిని అగ్ని మాపక సిబ్బంది సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. మంటలను అదుపు చేసి ఆర్పారు. అప్పటికే ఆ ఇంట్లో ఖరీదైన ఫర్నీచర్, విలువైన వస్తువులు, రెండు ఫ్రిజ్‌లు దగ్ధమయ్యాయి. వంటగది, హాలులోని వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి. బెడ్‌రూములోకి మంటలు ప్రవేశించకుండా అదుపు చేశారు. టీవీ ఫ్లగ్ వద్ద విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరిగి మంటలు వ్యాపించినట్లుగా అగ్నిమాపక శాఖ అధికారులు గుర్తించారు.

ప్రేమను ఒప్పుకోలేదని..

జీవితంపై విరక్తితో నర్సు ఆత్మహత్య.. తల్లిదండ్రుల ఆందోళన



నాగరాజు నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న సీఐ అశోక్‌కుమార్ (ఇన్‌సెట్‌లో) మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి

ఏలూరు క్రైం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : ప్రేమ వ్యవహారంలో ఓ ప్రైవేటు నర్సు జీవితంపై విరక్తి చెంది పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు, మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలివి.. ముసునూరు మండలం అక్కిరెడ్డిగూ డెంకకు చెందిన పంతంగి నాగరాజు రమాదేవి దంపతులు వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారు. వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె ఉమాశిరీష (23) జీఎన్‌ఎం చదివి తొలుత విజయవాడలోని ప్రైవేటు ఆసుపత్రిలో పనిచేసి ప్రస్తుతం ఏలూరు రామచంద్రరావుపేటలో ఉన్న ఒక ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తుంది. కుమారుడు సాయిమోహన్ ఏలూరు సీఆర్‌ఆర్ కాలేజీలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. ఉమాశిరీష విజయవాడలోని ఒక ప్రైవేటు ఆసుప త్రిలో నర్సుగా పనిచేసే సమయంలో విసన్నపేట మండలం ముత్రాసుపా లెంకు చెందిన ప్రవీణ్ అనే యువకుడు అదే హాస్పటల్‌లో పనిచేస్తూ పరిచయం అయ్యాడు. వీరిద్దరూ ప్రేమలో పడ్డారు. వీరి ప్రేమ వ్యవహారం శిరీష తల్లిదండ్రు లకు తెలియడంతో ఆమెను అక్కడ నుంచి మాన్పించి ఏలూరులో చేర్పిం చారు. ఆ యువకుడిని హెచ్చరించారు. తిరిగి మళ్లీ వారు ప్రేమ కార్యకలాపాలు కొనసాగడంతో అతడినే పెళ్లి చేసుకుంటానని మృతురాలు తల్లిదం డ్రులకు చెప్పింది. వారు అంగీకరిం చకపోవడంతో ప్రేమ జంట తొలుత ఆత్మహత్య చేసుకోవాలని భావించి నట్లు సమాచారం. ప్రస్తుతం ఇంటికి వెళ్లిన శిరీష తన ప్రేమ వ్యవహారాన్ని మరోమారు తన తల్లిదండ్రులకు చెప్పడంతో వారు నిరాకరించారు. మానసికంగా, తీవ్రంగా కుమిలిపోయిన శిరీష ఈనెల 11వ తేదీన తన ఇంటివద్దే పురుగుల మందు తాగేసింది. తల్లిదండ్రు లు ఆమెను తొలుత ధర్మాజీగూడెం ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లగా అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం ఏలూరు తీసుకువచ్చారు. చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం మృతి చెందింది.

పురుగుల మందు డబ్బాతో తల్లిదండ్రుల నిరసన

మార్చురీ వద్ద మృతదేహాన్ని భద్రపర్చిన అనంతరం ఆమె తల్లిదండ్రులు నాగరాజు, రమాదేవిలు మార్చురీ గేటు వద్ద మండుటెండలో కూర్చుని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. న్యాయం చేయకపోతే పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకుంటామని చేతిలో పురుగుల మందు డబ్బాపెట్టుకుని అక్కడే నిరసన తెలియజేశారు. సమాచారం అందుకున్న టూటౌన్ సీఐ జి. అశోక్‌కుమార్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని వారి నుంచి వివరాలు అడిగి తెలుసుకుని ముసునూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ముసునూరు పోలీసులు సా యంత్రానికి ఏలూరు చేరుకుని మృతురా లి కుటుంబ సభ్యుల నుంచి ఫిర్యాదు తీసుకున్నారు. ఇదిలా ఉండగా తన కుమార్తెను మోసగించడం విసన్నపేట మండలం ముత్రాసుపాలెంకు చెందిన ప్రవీణ్ మోసగించడం వల్లే ఆత్మహత్య చేసుకుందని తన బిడ్డ మరణానికి అతనే కారకుడు అంటూ అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శిరీష మృత దేహానికి ఆదివారం పోస్టుమార్టం నిర్వహించనున్నారు.



గోనె సంచుల గొడౌన్‌లో ఎగసిపడుతున్న మంటలు

జువ్వలపాలెంలో షార్ట్ సర్క్యూట్..

- గొడౌన్‌లో అగ్నిప్రమాదం.. రూ.8 లక్షల నష్టం

కాళ్ళ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : జువ్వలపాలెంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో శనివారం తెల్లవారు జామున గోనెసంచుల గొడౌన్‌లో అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో సుమారు రూ. 8 లక్షల విలువైన సంచులు దగ్ధమైనట్లు ఆకివీడు ఫైర్ ఆఫీసర్ వై.నాగేశ్వరరావు తెలిపారు. సమాచారం తెలుసుకున్న సిబ్బంది హుటాహుటీన తరలివెళ్లి మంటలను అదుపు చేయడంతో సుమారు రూ. 2 లక్షల విలువైన సామగ్రి, సంచులు అగ్నికి ఆహుతి కాకుండా కాపాడినట్లు తెలిపారు.

సబ్సిడీ యంత్ర పరికరాల పంపిణీ

కలిదిండి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద శనివారం కూటమి నాయకులు సబ్సిడీ వ్యవసాయ యంత్ర పరికరాలను రైతులకు పంపిణీ చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, కలిదిండి డీసీ ఛైర్మన్ భోగేశ్వరరావు, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రత్నారావు, మండల వ్యవసాయాధికారి విద్యాసాగర్, సిబ్బంది పాల్గొన్నారు.

అదరగొట్టారు

ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాలల విద్యార్థుల ప్రతిభ



దుర్గానాగసాయి



బి.శ్రావణి



బి.సంజయకుమారి



వడుపు చాందిని

కైకలూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు తమ సత్తా చాటారు. కైకలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు 64 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం 112 మంది విద్యార్థులకు 71 మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ సంవ త్సరం 121 మందికి 44 మంది ఉత్తీర్ణత సాధించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ శాంతిజ్యోతి తెలిపారు. ఇంటర్ సెకండీయర్ ఎంపీసీ ఫలితాల్లో బి.దుర్గనాగసాయి 940 మార్కులతో ప్రథమ స్థానంలో నిలవగా ఒకేషనల్ గ్రూపునకు చెందిన బి.శ్రావణి 918 మార్కులతో ద్వితీయస్థానం, బైపీసీకి చెందిన బి.సంజయకుమారి 914 మార్కులతో తృతీయస్థానంలో నిలిచినట్టు తెలిపారు. భుజబలపట్నం జిల్లా పరిషత్ ప్లస్ బాలికల హైస్కూల్‌లో ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 12 మంది హాజరు కాగా 11 మంది ఉత్తీర్ణత సాధించినట్టు స్కూల్ హెచ్‌ఎం ఎన్.లక్ష్మీరాజేశ్వరి తెలిపారు. సెకండీయర్ బైపీసీ గ్రూపులో వడుపు చాందిని 952 మార్కుల తో ప్రథమస్థానం సాధించినట్టు తెలిపారు. ప్రథమ సంవత్స రం లో బైపీసీ విద్యార్థిని పోతుముడి కీర్తినాగభవాని 429 మార్కులతో ప్రథమస్థానం, మేడపాటి బ్లెస్సీ 400 మార్కులతో ద్వితీయస్థానం సాధించినట్టు తెలిపారు. సీఈసీ గ్రూపు విద్యార్థిని జల్లూరి నిఖిల 424 మార్కులు సాధించినట్టు తెలిపారు.

ముదినేపల్లి ప్రభుత్వ కళాశాలలో 71 శాతం ఉత్తీర్ణత



మహేశ్వరి



గాయత్రి

ముదినేపల్లి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షల్లో ముదినేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు 71 శాతం ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో 79 శాతం, ప్రథమ సంవత్సరం పరీక్షల్లో 63 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు 14 మంది విద్యార్థులు రాయగా 11 మంది, ప్రథమ సంవత్సరం పరీక్షలు 38 మంది రాయగా 24 మంది ఉత్తీర్ణత సాధించినట్టు కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఓరుగంటి సత్యనారాయణమూర్తి తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ గ్రూప్‌లో 75 శాతం, సీఈసీ గ్రూపులో 86 శాతం, హెచ్‌ఈసీ గ్రూపులో 67 శాతం, ప్రథమ సంవత్సరం ఎంపీసీ గ్రూపులో 50 శాతం, సీఈసీ గ్రూపులో 70 శాతం, హెచ్‌ఈసీ గ్రూపులో 60 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 1000కి 862 మార్కులు సాధించి సీఈసీ గ్రూపు విద్యార్థి డి.మహేశ్వరి కళాశాల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలువగా, 854 మార్కులు సాధించి ఎంపీసీ గ్రూపు విద్యార్థి కె.గాయత్రి ద్వితీయ స్థానంలో నిలిచిందని ప్రిన్సిపాల్ తెలిపారు.

కలిదిండి విద్యార్థుల ప్రతిభ



మండల ప్రథమ స్థానంలో నిలిచిన భానుని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ త్రినాథ్

కలిదిండి : ఇంటర్ ఫలితాల్లో కలిదిండి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు 86 శాతం మంది ఉత్తీర్ణులై య్యారని ప్రిన్సిపాల్ జి.త్రినాథ్ తెలిపారు. ఇంట ర్ సెకండ్ ఇయర్ విద్యార్థిని బోయిన భాను ఎంపీసీలో 1000కి 950 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థిని లిల్లి గ్రాస్ ఎంపీసీలో 470కి 448 మార్కులు సాధించిందన్నారు. విద్యార్థినులను జడ్పీటీసీ బొర్రా సత్యవతి, కలిదిండి సర్పంచ్ మారుతి ప్రసన్న, ప్రిన్సిపాల్ త్రినాథ్, అధ్యాపకులు సిబ్బంది అభినందనలు తెలిపారు.

నూజివీడుదే అగ్రస్థానం..



టి.స్వర్ణ

నూజివీడు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : నూజివీడులోని మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్ మొదటిసంవత్సరం ఫలితాల్లో బైపీసీ, ఎంపీసీ విభాగాల్లో అగ్రస్థానం సాధించింది. నూజివీడుకు చెందిన టి.స్వర్ణ బైపీసీ మొదటి సంవత్సరం ఫలితాల్లో 440 మార్కులకు 433 మార్కులు సాధించి జిల్లా ప్రభుత్వ కళాశాలల్లో అగ్రస్థానంలో నిలి చింది. నూజివీడుకు చెందిన పీవీ నాగలక్ష్మి, ఎంపీసీ విభాగం నుంచి 470 మార్కులకు 454 మార్కు లు సాధించి జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అగ్రస్థానంలో నిలిచింది.

ప్రతిభ చూపిన ఆగిరిపల్లి విద్యార్థులు



లావణ్య



ఎన్.దివ్య



డి.రజని

ఆగిరిపల్లి : ఇంటర్ ఫలితాలలో ఎంవీఎన్- వైవీఎన్ ప్రభుత్వ కళాశాల మెరుగైన ఫలితాలు సాధించిందని కాలేజి ప్రిన్సిపాల్ యోహన్ తెలిపారు. మొదటి సంవత్సరం విద్యార్థులు 62 మందికి 42 మంది ఉత్తీర్ణత (68%), ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 50 మందికి 49 మంది ఉత్తీర్ణత (98%) ఉతీర్ణత సాధించారు.ద్వితీయ సంవత్సరం విద్యార్థిని విరంకి లావణ్య (971) స్టేట్, కాలేజి టాపర్‌గా నిలిచింది. ఎన్.దివ్య (926) ద్వితీయ, డి.రజని (913)తృతీయ స్థానాల్లో నిలిచారు. ఈదర జడ్పీ హైస్కూల్ ప్లస్ విద్యార్థులు నూరుశాతం ఉతీర్ణత సాధించారని హెచ్‌ఎం శారద తెలిపారు. వీరవల్లి సంజన బైపీసీ (968) ప్రథమ స్థానం, చిట్టిపోతుల వెంకటలక్ష్మి (800) ద్వితీయ, బల్ల దీక్షిత (758) తృతీయ స్థానం సాధించారు.

సున్నా ఉత్తీర్ణత..

ముసునూరు : ముసునూరు జడ్పీ పాఠశాల ఉన్న ఇంటర్ కాలేజీలో ఫస్ట్ ఇయర్ ఫలితాల్లో సున్నా ఉత్తీర్ణత వచ్చింది. ఈ కాలేజీలో బైపీసీ చదువుతున్న 11 మంది విద్యార్థినుల్లో ఒక్కరూ కూడా పాస్ అవలేదు. లెక్చరర్ల కొరత లేకపోయినా సున్నా ఉత్తీర్ణత రావడంపై విమర్శలు వ్యక్తమౌతున్నాయి. విద్యాబోధన సరిగ్గా లేకపోవడం వల్లనే ఒక్కరూ కూడా పాస్ అవలేదని విద్యార్థుల తల్లిదండ్రుల ఆరోపిస్తున్నారు. గత ఏడాది ఇక్కడ సున్నా ఉత్తీర్ణతే రావడం గమనార్హం.

ఇంటర్వ్యూ..

వేసవిలో దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



వెంకటేశ్వరరావు, ఎస్ఐ

- **వేసవిలో దొంగతనాలను నియంత్రణకు చర్యలు?**

జవాబు : రాత్రిపూట పోలీసు బీటు ఏర్పాటు చేశాం. సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నాం. మైకులతో ప్రచారం, మహిళా పోలీసులతో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నాం. రాత్రి వేళ సిబ్బంది బైక్‌లపై బందోబస్తు నిర్వహిస్తున్నారు .

- **మండలంలో సీసీ కెమెరాలు ఎన్ని ఉన్నాయి?**

జవాబు: సుమారు 300 లకుపైగా సీసీ కెమెరాలు ఉన్నాయి. ప్రధాన కూడళ్లతో పాటు ఆలయాలు, బాలికల హాస్టళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం.

- **దొంగతనం జరిగిన వెంటనే ఎవరికి సమాచారం అందించాలి?**

జవాబు : దొంగతనం జరిగిన వెంటనే 112 నంబర్‌కి సమాచారం అందించాలి. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుంటారు. అపరిచిత వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తుంటే సమాచారం అందించాలి.

- **వేసవిలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి ?**

జవాబు : ఆరు బయట నిద్రించే వారు తలుపులకు తాళాలు వేసుకోవాలి. విలువైన వస్తువులను బ్యాంక్ లాకర్లలో పెట్టుకోవాలి. ఊర్లు వెళ్లే వారు పోలీసులకు సమాచారం అందించాలి.

- **పేకాట, కోడిపందేలు నివారణకు తీసుకుంటున్న చర్యలు ?**

జవాబు : పేకాట, కోడిపందేలు నిర్వహించే వారిపై రెండుసార్లు కేసు నమోదైతే రౌడీ షీటు ఓపెన్ చేస్తాం. జూద క్రీడలు జరుగకుండా పోలీసు గస్తీ నిర్వహిస్తున్నాం.

- కలిదిండి

అర్ధరాత్రి రోడ్లపై తిరుగుతున్న వారికి కౌన్సెలింగ్

నూజివీడు, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి) : నూజివీడు పట్టణంలో అనవసరంగా అర్ధరాత్రి పూట రహదారులపై తిరుగుతున్న యువకులను శుక్రవారం రాత్రి నూజివీడు పట్టణ సీఐ సత్య శ్రీనివాస్ నూజివీడు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. శనివారం ఉదయం వారి తల్లిదండ్రులకు పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి పంపారు.



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

చాట్రాయి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): చాట్రాయి మాలపల్లి దళితవాడలో పునర్నించిన అంబేడ్కర్ విగ్రహాన్ని తెలుగు సాంస్కృతిక సంస్థ సీఈవో రేగళ్ళ మల్లిఖార్జునరావు, ఏపీ హైకోర్టు అడ్వకేట్ పాలేటి మహేష్ శనివారం ఆవిష్కరించారు. వక్తలు మాట్లాడుతూ అంబేడ్కర్ భారత రాజ్యాంగం ద్వారా దళితులు పేదలు మహిళలకు స్వాతంత్ర్య ఫలాలు అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపారని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి మందపాటి బసవారెడ్డి దళిత నాయకులు బుర్రి రాజేష్, గంధం సామ్యూల్, రాజేశ్, ఏసు రత్నం, నక్కా రాము తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్థాయిలో బీజేపీ బలోపేతం

పార్టీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిషోర్



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిషోర్

నూజివీడు టౌన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : దేశ సేవ, జనహితం కోరే నాయకత్వంతో భారతీయ జనతా పార్టీ ప్రపంచంలోనే అతి పెద్ద రాజకీయ పార్టీగా అవతరించిందని బీజేపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్ కిశోర్ అన్నారు. నూజివీడులో జిల్లా కోశాధికారి మాటూరి రవికాంత్ కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ స్థాయి క్రియాశీల సభ్యుల సమావేశాన్ని కార్యక్రమ కోఆర్డినేటర్ మాగంటి వాసు అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా విక్రమ్ కిశోర్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. దీనిలో భాగంగా సంస్థాగతంగా పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేయాలని అందుకు అనుగుణంగా శక్తీ కేంద్రాలు, పోలింగ్ బూత్ కమిటీలు నిర్మాణం వేగవంతం చేయాలన్నారు. బాధ్యులైన పార్టీ శ్రేణులు విస్తృతంగా తమ తమ మండలాలలో పర్యటనలు జరపాలన్నారు. పార్టీ శ్రేణులు ప్రజా సమస్యలపై స్పందించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువయ్యేలా ప్రచారం చేయాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శులు కోటప్రోలు కృష్ణ, నగర పాటి సత్యనారాయణ, సీనియర్ నాయకులు బోను అప్పారావు, రాజశేఖర్, భావరాజు పుల్లారావు, నూజివీడు, చాట్రాయి, ముసునూరు మండల అధ్యక్షులు మల్లేపూడి నాగమణి, ఓబిళ్లనేని రాజా, బడుగు శ్రీకాంత్, నూజివీడు పట్టణ ప్రధాన కార్యదర్శులు మల్లిఖార్జున జగదీష్, సతీష్ యాదవ్ క్రియాశీలక సభ్యులు పాల్గొన్నారు.

ఆర్జీయూకేటీలో ఉచిత మెగా వైద్య శిబిరం



ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యులు

నూజివీడు టౌన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : ఆర్జీయుకేటీ నూజివీడులో క్యాంపస్ మెయింటినెన్స్ విభాగం ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని 5000 పైగా రోబోటిక్ ఆపరేషన్స్, 750కి పైగా మెదడు ఆపరేషన్స్ 1000కి పైగా లేసర్ ఆపరేషన్స్ చేసిన శ్రీకర హాస్పటల్ విజయవాడ వారు నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో గుండె, లివర్, గ్యాస్ట్రిక్ గైనకాలజీ విభాగాలకు సంబంధించినటువంటి వైద్యులు విచ్చేసి పరీక్ష నిర్వహించి సలహాలు, సూచనలు, ఉచితంగా మందులు అందజేశారు. డైరెక్టర్ అమరేంద్ర కుమార్ వైద్య బృందంతో చర్చించి, ఆర్జీయూకేటీ క్లినిక్‌లో కల్పించాల్సిన మౌలిక సదుపాయాలపై అడిగి తెలుసుకున్నారు. దాదాపుగా వెయ్యి మంది వరకు ఈ శిబిరంలో వైద్యసేవలు ఉపయోగించుకున్నారు. డా.వంశీవర్ధన్, డా.సోమకృష్ణ, డా.అర్చన, డా.పి మాధురి, డా.పి రవళి, డా.మనోజ్ అర్థోపెడిక్, డా.జీవీకే రావ్ షుగర్ స్పెషల్టి, డా. తరుణి డెంటిస్ట్, ఏవో డా.లక్ష్మణ్, ఇన్‌చార్జీ డా.ఓ శ్రీహరి, పిఆర్‌వో డా.రాజేష్, చీఫ్ వార్డెన్ డా.పీవీ లక్ష్మణరావు, హాస్పిటల్ సిబ్బంది, ఫార్మసిస్ట్ విజయబాబు, ఇతర బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



వైద్య పరికరాలను ప్రారంభిస్తున్న మంత్రి సారథి

ప్రజల సేవలో కార్పొరేట్ సంస్థలు భాగస్వాములు కావాలి : మంత్రి

నూజివీడు టౌన్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి) : ప్రజల సేవలో కార్పొరేట్ సంస్థలు భాగస్వాములు కావడం అభినందనీయమని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. స్థానిక ఏరియా ఆసుపత్రికి వెలగపూడి రాజకుమార్ ట్రస్ట్ వారు అందించిన 13 లక్షల రూపాయల విలువైన వైద్య పరికరాలను శుక్రవారం సాయంత్రం మంత్రి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వెలగపూడి రాజకుమార్ ట్రస్ట్ అధినేతలు నూజివీడు ఏరియా ఆసుపత్రికి రూ.13 లక్షల విలువచేసే నేత్ర పరీక్షకు సంబంధించిన పరికరాలు, చెవి, ముక్కు, గొంతు ఆపరేషన్ సంబంధించిన మైక్రోస్కోప్ 1, వివిధ అనారోగ్య సమస్యల పరీక్షలకు సంబంధించిన వైద్య పరికరాలు అందించారని, వీటితో పాటు రోగులు వేచి ఉండే గదిని నిర్మించారన్నారు. సమాజంలో ఆర్థికంగా ఎదిగిన వ్యక్తులు సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావడం నిజంగా అభినందించదగిన విషయమన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్ర కృష్ణ, జిల్లా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో ఒకరికి జీవిత ఖైదు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : మతిస్థిమితం లేని 16 ఏళ్ల బాలికను అపహరించి అత్యాచారానికి పాల్పడినట్లు ఓ వ్యక్తిపై నేరం రుజువు కావడంతో అతడికి జీవితఖైదు, రూ.ఐదు వేలు జరిమానా విధిస్తూ ఏలూరులోని పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి ఎస్. ఉమాసు నంద తీర్పు చెప్పారు. చాగల్లు మండలం లో ఒక గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని బాలికను రాజమహేంద్రవరం, నామవరానికి చెందిన నందా శ్రీను(35) ఆ బాలికను 2017 జులైలో అపహరించి, అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై బాలిక తల్లి చాగల్లు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అప్పటి ఎస్ఐ ఎం.జయబాబు కేసు నమోదు చేయగా అప్పటి కొవ్వూరు డీఎస్పీ ఎస్.వెంకటేశ్వరరావు కేసు దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్టు చేశారు. ఈ కేసు ఏలూరు పోక్సో కోర్టులో విచారణ సాగింది. నిందితుడిపై నేరం రుజువు కావడంతో జీవితఖైదు విధించారు. బాధి తురాలికి రూ.రెండు లక్షలు పరిహారం చెల్లించాలని తీర్పు చెప్పారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	133, 142, 153
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడి గుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475